

పురం.. పుట్టినిల్లు..!







1986లో హిందూపురం నియోజకవర్గంలో పర్యటనలో, దేమకేతేపల్లిని సందర్శించిన సమయంలో ఎన్టీఆర్‌తో అంజినప్ప

హిందూపురం/చిలమత్తూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో ఆవిర్భవించిన పార్టీ తెలుగుదేశం. అప్పటి వరకూ వెండితెరపై వెలిగిన ఎన్టీఆర్.. పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారం చేపట్టి.. సంచలనం సృష్టించారు. నాలుగు దశాబ్దాలకు పైగా గడిచిన కాలంలో టీడీపీ ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొంది. మరెన్నో అద్భుత విజయాలను సాధించింది. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడటానికి ఆరుసార్లు కారణమైంది. ఎన్టీఆర్ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న సీఎం చంద్రబాబు నాయుడు.. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా దేశ రాజకీయాల్లో ప్రత్యేక ముద్ర వేశారు. అలాంటి పార్టీకి హిందూపురంతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఇప్పటి వరకూ పార్టీ ఓటమి ఎరుగని నియోజకవర్గంగా ఖ్యాతి గడిచింది. ఈ నేపథ్యంలో పురంలో 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించేందుకు పార్టీ నాయకులు ఏర్పాట్లు చేశారు.



హిందూపురంలో ప్రత్యేక అలంకరణలో ఎన్టీఆర్ విగ్రహం

- ఆది నుంచి టీడీపీకి అపూర్వ ఆదరణ
- ఎన్టీఆర్, బాలకృష్ణ హ్యాట్రిక్ విజయాలు
- నేడు పార్టీ ఆవిర్భావ దినోత్సవం

తిరుగులేని విజయాలు

తెలుగుదేశం పార్టీ 1982, మార్చి 29న ఆవిర్భవించింది. 1983లో సాధారణ ఎన్నికలు జరిగాయి. పార్టీ ఘన విజయం సాధించి, అధికారం చేపట్టింది. హిందూపురం నుంచి ఆ పార్టీ అభ్యర్థి రంగనాయకులు విజయం సాధించారు. ఆ తరువాత 1985, 89, 94 ఎన్నికల్లో పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు బరిలోకి దిగి ఘన విజయాలు సాధించారు. ఆ తరువాత కూడా టీడీపీ అభ్యర్థులే విజయం సాధించారు. అభ్యర్థితో నిమిత్తం లేకుండా.. టీడీపీ నుంచి ఎవరు బరిలో దిగినా ఇక్కడి ఓటర్లు ఆదరిస్తున్నారు. ఎన్టీఆర్, ఆయన తనయుడు నందమూరి బాలకృష్ణ హ్యాట్రిక్ విజయాలు సాధించారు. నందమూరి హరికృష్ణ ఒకసారి గెలిచారు. ఎన్టీఆర్‌ను, ఆయన వారసులను ఆదరిస్తున్న హిందూపురం.. నందమూరి పురంగా పేరుగాంచింది.

వారే బలం..

హిందూపురం నియోజకవర్గంలో బడుగు బలహీన వర్గాల ఓట్లు అత్యధికంగా ఉన్నాయి. టీడీపీకి ఈ వర్గాలు ఆదినుంచి అండగా ఉంటున్నాయి. పార్టీ ఆవిర్భావం నుంచి జరిగిన 11 ఎన్నికల్లో అప్రతిహత విజయాలు సాధించడానికి వీరి అండే ప్రధాన కారణమని పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. పార్టీకి కంచుకోట అయిన నియోజకవర్గానికి అభివృద్ధి బాటలో నడిపేందుకు ఎన్టీఆర్ నుంచి బాలకృష్ణ వరకు తమ వంతు కృషి చేస్తూ ఉన్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నియోజవర్గానికి ప్రత్యేక అధికారిగా ఐఏఎస్ అధికారిని నియమించారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నియోజకవర్గ అభివృద్ధిఇపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు తీసుకువస్తున్నారు.

నేడు వాడవాడలా వేడుకలు

టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలో వాడవాడలా శనివారం పార్టీ జెండాలను ఆవిష్కరిస్తున్నారు. పల్లెలు, పట్టణాల్లో వేడుకలకు ఏర్పాట్లు చేశారు. జెండా దిమ్మెలకు రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు.

ఆయన రాకతోనే న్యాయం

దేమకేతేపల్లి అంజినప్ప

రాజకీయాల్లోకి ఎన్టీఆర్ రాకతోనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగిందని టీడీపీ సీనియర్ నాయకుడు దేమకేతేపల్లి అంజినప్ప అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 'టీడీపీ ఆవిర్భావం తరువాత హిందూపురం నియోజకవర్గ రూపురేఖలు మారిపోయాయి. కాంగ్రెస్ హయాంలో అన్ని రకాలుగా వెనుకబడిపోయిన ఈ ప్రాంతంలో విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాలలో ఎన్టీఆర్ ఎంతో అభివృద్ధి చేశారు. అందుకే హిందూపురం టీడీపీకి కంచుకోటగా మారింది...' అని వివరించారు. బలహీన వర్గాలకు చెందిన తనను 1986లో ఎన్టీఆర్ స్వయంగా దగ్గరకు పిలిచి, రాజకీయ భిక్ష పెట్టారని గుర్తు చేసుకున్నారు. 'నియోజకవర్గంలో పర్యటించే సమయంలో తన వాహనంలో మా లాంటి బీసీ నాయకులను పక్కనే కూర్చోబెట్టుకునేవారు. గాద్రాళ్లపల్లిలో అప్పట్లో ఉన్న సాధారణ ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లోనే విశ్రాంతి తీసుకుని, స్థానిక ప్రజలతో ముచ్చటించారు. ఆ విషయాన్ని ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ మరవలేరు..' అని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆయన భౌతికంగా లేకపోయినా, ఆయన సేవలు, పాలనా దక్షత భావి తరాలకు స్ఫూర్తిని స్తూ ం టా య ం ని అన్నారు.

జీవశాస్త్రం పరీక్షకు 265 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం జరిగిన జీవశాస్త్ర(బయాలజికల్‌సైన్స్) పరీక్షకు 265 మంది గైర్హాజర య్యారని డీఈఓ కిష్టప్ప తెలిపారు. హాజరు 98.80 శాతంగా నమోదైందన్నారు. ఓపెన్ స్కూల్ కింద పదోతరగతి పరీక్షలు 11 కేంద్రాలలో 535 మందికిగాను 428 మందిపరీక్షలు రాశారని 107 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

పది సోషల్ పరీక్ష వాయిదా

కొత్తచెరువు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పదో తరగతి సోషల్ పరీక్ష వాయిదా వేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కిష్టప్ప శుక్రవారం ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 31వ తేదీన పరీక్ష నిర్వహించాల్సి ఉంది. 31న రంజాన్ పండుగ కావడంతో ప్రభుత్వం పరీక్షను ఏప్రిల్ 1వ తేదీకి వాయిదా వేసిందన్నారు. 1వతేదీ ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఈ మార్పును పరీక్షల సిబ్బంది, విద్యార్థులు, హెచ్ఎంలు గమనించాలన్నారు.

మెప్మాకు మూడు గిన్నిస్ రికార్డులు

అభినందనీయం: కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, మార్చి28(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసం కృషిచేస్తున్న మెప్మాకు మూడు గిన్నిస్ రికార్డులు దక్కాయి. దీంతో సిబ్బందిని కలెక్టర్ టీఎస్ చేతన్ అభినందించారు. మెప్మా పీడీ విశ్వజ్యోతి ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం కలెక్టర్‌ను కలిసి గిన్నిస్ రికార్డుల ధ్రువపత్రాలను అదించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మెప్మాకు మూడు అవార్డులు రావడం శుభపరిణామన్నారు. అనంతరం సైనిక సంక్షేమ నిధికోసం మహిళా సంఘాల నుంచి సేకరించిన రూ.75వేల చెక్కును సైనిక సంక్షేమాధికారి గిరీష్‌కు కలెక్టర్ అందించారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు పద్మావతి, భవాని, సిబ్బంది పాల్గొన్నారు.



గిన్నిస్ రికార్డు పత్రాలను కలెక్టర్‌కు అందజేస్తున్న మెప్మా అధికారులు

ధ్రువపత్రాల అందజేత

ధర్మవరం(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని మహిళా సంఘాలకు ప్రకటించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ పత్రాన్ని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్.. మెప్మా సిబ్బందికి అందజేశారు. ఈనెల 8న మహిళా దినోత్సవం సందర్భంగా ఒక్కరోజే ఆన్‌లైన్‌లో రెండు లక్షలకుపైగా విక్రయాలు చేసినందుకు గిన్నిస్ బుక్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. అందుకు సంబంధించిన పత్రాలను స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో మెప్మా సిబ్బందికి అందజేసి, అభినందించారు.

ఆర్డీఓలు బాధ్యతగా పనిచేయాలి : కలెక్టర్

పుట్టపర్తిటౌన్, మార్చి28(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారంలో ఆర్డీఓలు బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. ఆర్డీఓలతో కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నిర్ణీత సమయంలోపు హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వేసవిలో జిల్లాలో ఎక్కడ తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, పుట్టపర్తి, పెనుకొండ, ధర్మరం, కదిరి, ఆర్డీఓలు సువర్ణ, ఆనంద్, మహేష్, వీవీఎస్ శర్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, గ్రామ వార్డు సచివాలయాధికారి సుధాకర్ రెడ్డి, సీపీఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పదవుల పండుగ

- జిల్లాలో మూడు మార్కెట్ కమిటీల అధ్యక్షుల నియామకం
- రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయి పాలకవర్గం



అశ్వత్థనారాయణ రెడ్డి

పుట్టపర్తి, మార్చి28(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్న ఆశావహులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. పండుగ పూట నియామకాలకు తెరలేపింది. నామినేటెడ్ పదవుల మూడో జాబితాను ఎట్టకేలకు శుక్రవారం ప్రకటించింది. జిల్లాలో మూడు మార్కెట్ యార్డుల కమిటీలకు చైర్మెన్‌ను నియమించింది. వీటిలో రెండు టీడీపీకి, ఒకటి బీజేపీకి దక్కింది. జిల్లాలో చింతపండు, మిర్చి మార్కెట్‌గా పేరొందిన హిందూపురం మార్కెట్ యార్డు చైర్మన్‌గా టీడీపీ గ్రామీణ మండల కన్వీనర్ అశ్వత్థనారాయణరెడ్డిని నియమించారు. మడకశిర మార్కెట్ యార్డు చైర్మన్‌గా రొళ్ల మండలం హెచ్‌డీ హళ్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బీఎస్ గురుమూర్తిని ప్రకటించారు. ధర్మవరం మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా బీజేపీ నాయకురాలు జగ్గా నాగతర్నమ్మను నియమించారు. రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయి పాలకవర్గాన్ని ప్రభుత్వం ప్రకటించనుంది. జిల్లాలో ఎనిమిది మార్కెట్ య ా ర ్ డ ు ల ు ఉండగా.. మూడింటికి చైర్మెన్ నియమించారు. మరో ఐదు ప్రకటించాల్సి ఉంది. ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు. ఉగాది రోజున మరిన్ని నామినేటెడ్ పదవుల ప్రకటనలు ఉంటాయని ఆశావహులు సంబరపడిపోతున్నారు. పురం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేయడం పట్ల అశ్వత్థనారాయణ రెడ్డి హర్ష వ్యక్తం చేశారు. ఆయనను పలువురు టీడీపీ నాయకులు సత్కరించారు.



గురుమూర్తి



జగ్గా నాగరత్నమ్మ

ఎంపీపీల ఎన్నిక వాయిదా

కోరం లేకపోవడమే కారణం

- ఆగిన రామగిరి, గాండ్లపెంట ఎంపీపీ ఎన్నికలు
- గాండ్లపెంటలో ప్రిసైడింగ్ అధికారి మార్పు
- జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ హౌస్ అరెస్టు



ఎంపీపీ ఎన్నికల సమావేశానికి హాజరైన అధికారి తదితరులు

అనంతపురం విద్య/పుట్టపర్తి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కోరం లేకపోవడంతో శ్రీ సత్యసాయి జిల్లాలోని రామగిరి, గాండ్లపెంట ఎంపీపీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. గాండ్లపెంట మండలం ప్రిసైడింగ్ ఆఫీసర్, ఏపీఎంఐసీ పీడీ సుదర్శన్ టెన్షన్‌కు గురై, నిస్సహాయత వ్యక్తం చేయడంతో జిల్లా కలెక్టర్ విషయాన్ని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాలతో కొత్త ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా శ్రీసత్యసాయి డ్వామా పీడీ విజయప్రసాద్‌ను నియమించారు. ఆయన ఆధ్వర్యంలో ఉదయం గాండ్లపెంటలో ఎన్నికల నిర్వహణకు యత్నించారు. ఏడుగురు ఎంపీటీసీ సభ్యుల్లో నలుగురు రావాల్సి ఉండగా ముగ్గురే హాజరు కావడంతో కోరం లేదని ఎన్నికను వాయిదా వేశారు. రామగిరిలో 9 మంది ఎంపీటీసీల్లో ఐదుగురు సభ్యులు రావాల్సి ఉండగా నలుగురు మాత్రమే హాజరు కావడంతో కోరం లేక ఎన్నికలు వాయిదా వేశారు. ఈ రెండు మండలాల్లో ఎన్నికలు వాయిదా పడటంపై జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ....రెండు చోట్ల కోరం లేక ఎన్నికలు వాయిదా పడ్డాయన్నారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్‌కు రిపోర్ట్ చేశామన్నారు. తర్వాత

(మిగతా 4లో...)



అందరికీ ఉద్యోగాలు

పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవం

ధర్మవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని గుట్టకిందపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవాలు నిర్వహించిన ట్లు కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు తెలిపారు. కళాశాలలో చివరి సంవత్సరం విద్యార్థులు మొత్తం 109 మంది ఉద్యోగాలు సాధించారని ఆయన తెలిపారు. వీరందరూ రాయల్ ఎన్‌ఫీల్డ్, విస్టన్ ఇన్ఫోకామ్, టీ ఈ కన్నెక్టివిటీ, టెస్కాం, సస్మాస్ హెచ్‌ఈటీ టెక్నాలజీ తదతర కంపెనీల లో ఉద్యోగాలు పొందారు. ఇందులో 54 మంది విద్యార్థులు రెండు కంపెనీలలో ఉద్యోగాలు సాధించారన్నారు. వీరికి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు శుక్రవారం నియామక పత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు జనవరి నుంచి మార్చి వరకు నాలుగు విడతలుగా జాబ్ మేళా నిర్వహించగా 109 మంది ఉద్యోగాలు పొందారన్నారు. వీరందరికి రూ.2లక్షల నుంచి రూ.2.5లక్ష వరకు ప్యాకేజీ లభించినట్లు తెలిపారు.

ఇబ్బందులకు చెక్

పింఛన్ల పంపిణీకి కొత్త స్కానర్లు

ధర్మవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో సాంకేతిక ఇబ్బందుల తొలగింపునకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కొత్తగా సమకూర్చిన అధునాతన వేలిముద్ర(ఎంఎఫ్ఎస్ 110, ఎల్-1 ఫింగర్ ప్రింట్) స్కానర్లను ఇప్పటికే జిల్లాలోని ఆయాగ్రామ, వార్డు సచివాయాలకు అధికారులకు అందజేశారు. వీటితో ఏప్రిల్ నెల నుంచి పకడ్బందీగా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతినెలా ఒకటో తేదీన సామాజిక భద్రతా పింఛన్లను పంపిణీ చేస్తున్నప్పటికీ పాత బయోమెట్రిక్ పరికరాలతో తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 544 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటన్నంటికి 4,872 స్కానర్లను పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. వేలిముద్రలు సరిగా పడక కొంతమంది లబ్ధిదారులు పింఛను అందుకునే విషయంలో అవస్థలు పడుతున్నారు. సచివాలయాల చుట్టూ రెండు, మూడుసార్లు తిరిగి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి. వృద్ధుల వేలిముద్రలు పడకపోవడం, తరచూ స్కానర్లు మరమ్మతులకు గురవుతుండటం, సాంకేతిక సమస్యలు తదితర కారణాలతో పింఛన్ల పంపిణీ అనుకున్నంత వేగంగా జరగడం లేదు. వేలిముద్రలు పడని వారికి అధికారుల ప్రత్యేక అనుమతితో సిబ్బంది పింఛను డబ్బులు అందించాల్సి వస్తోంది.



కొత్త స్కానర్లు

ఇబ్బందులు ఉండవు

ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన కొత్త ఎల్-1 వేలిముద్ర స్కానర్లతో ఇకపై లబ్ధిదారులు, సిబ్బందికి ఇబ్బందులు ఉండవు. వేగవంతంగా పింఛన్ల పంపిణీ సాగుతుంది. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి కొత్తగా అందించిన వేలిముద్ర స్కానర్లతోనే ఏప్రిల్ నెల పింఛను పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశాం.

- హిమవాణి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కో-ఆర్డినేటర్, శ్రీసత్యసాయి జిల్లా

ఎండ పొడ ఏమాత్రం తగలని జీవితం. పని అంతా నీడ పట్టునే. టేప్ రికార్డర్‌లో వినసొంపైన పాటలు వింటూ.. పోగులను అందమైన చీరలుగా తయారు చేస్తూ హాయిగా కాలం గడిపే నేతన్నను చూసి ఇది కదా జీవితం అంటే అని ఎండలో పని చేసే కష్టజీవులు కాస్త అసూయ పడేవారు. ఇదంతా గతం. పెరిగిన టెక్నాలజీ వల్ల చేతి మగ్గాలు కనుమరుగయ్యాయి. మొత్తం మరమగ్గాల మయం అయిపోయింది. ఒకప్పుడు చేనేత మగ్గాలతో కళకళలాడిన ఇళ్లు, ఊళ్లు నేడు వెలవెల బోతున్నాయి. కుటుంబ పోషణ భారమై చేనేతలు ఇతర వృత్తుల్లోకి మారారు. ఆకోవకు చెందిన వ్యక్తే సోమందేపల్లిలోని మణికంఠ కాలనీకి చెందిన చేనేత కార్మికుడు నాగరాజు.



మజ్జిగ అమ్ముకుంటున్న నేతన్న నాగరాజు

పోగు బంధం తెంచుకుని..

● ఒకప్పుడు నాలుగు మగ్గాలతో బాగా బతికి.. ● నేడు మజ్జిగ అమ్ముకుంటూ జీవనం

నాగరాజు ఒకప్పుడు బాగా బతికాడు. నాలుగు మగ్గాలు ఏర్పాటు చేసుకుని నలుగురికి ఉపాధి కల్పించాడు. ప్రస్తుతం అప్పులపాలై తాను దర్జాగా బతికిన ఊరిలో సైకిల్‌పై వీధి వీధి తిరిగి మజ్జిగ అమ్ము కుంటున్నాడు. ఆయన్ను కదిలిస్తే తన కడుపుమండిన కష్టాలను వివరించారు. తొమ్మిదేళ్ల కిందట మగ్గాల కోసం ఇల్లు

పువ్వులమ్మిన చోటే..

బాడుగకు తీసుకుని నాలుగు చేతిమగ్గాలు ఏర్పాటు చేసుకున్నానన్నారు. నలుగురికి పని కల్పిస్తూ ముడిసరుకులను మాస్టర్‌వీవర్స్ వద్ద తెచ్చుకుని ఒక్కో మగ్గంపై వారానికి ఒకటి రెండు చీరలు తయారీ చేయించేవాడినన్నారు. నాలుగు మగ్గాలలో నేసిన చీరలను ఒక్కోదానికి మాస్టర్ వీవర్స్ వెయ్యి చొప్పున ఇచ్చేవారన్నారు. అం దులో ఖర్చులన్నీ పోను చీరపై రూ.300 మిగిలేదన్నారు. ఇలా వారానికి రూ.2వేల నుంచి రూ.3వేలు సంపాదించే వాడినని తెలిపారు. తరువాత కాలంలో చేతిమగ్గాలు వైభవం కోల్పోవ డంతో గిట్టుబాటు ధర లేక మగ్గాలు అమ్మేసి సెక్యూరిటీ గార్డ్‌గా బెంగళూరులో మూడేళ్లపాటు జీవనం సాగించినట్లు తెలిపారు.

కుమారుడి అనారోగ్యంతో సొంతూరికి..

పెద్దకుమారుడికి ఆరోగ్యం సరిగా ఉండకపోవడంతో ఉద్యోగం వదిలి స్వగ్రామానికి వచ్చినట్లు వెల్లడించాడు. అనంతరం రెండేళ్లు బేల్దారి పనులు చేశానన్నారు. కరోనా వ్యాధి ప్రబలడం, తనకు ఆరోగ్యం క్షీణించ డంతో రూ.2లక్షలు దాకా ఖర్చుచేసి బతికి బయటపడ్డానన్నారు. ప్రస్తుతం కూలి పనులు చేతకక మజ్జిగ అమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.5లక్షలు అప్పులున్నాయన్నారు. సొంత ఇల్లు కూడా లేక బాడుగ ఇంటిలో నివాసముంటున్నట్లు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా మజ్జిగ అమ్మితే రోజూ రూ.200 గిట్టుబాటు అవుతుందన్నారు. తనకు భార్య అంజినమ్మ, కుమారులు ఆదినారాయణ, ఓబుళరాజు, నరసింహ ఉన్నారు. వీరు ప్రభుత్వ పాఠశాలలో చదువుతుండగా చాలీచాలని సంపాదనతో తాను సంసారాన్ని నెట్టుకొస్తున్నట్లు తెలిపారు.

– ఆంధ్రజ్యోతి, సోమందేపల్లి



కుటుంబ సభ్యులతో చేనేత నాగరాజు

మయ్యాయో ఏమో..!

కరోనా పేరు వింటేనే ఇప్పటికీ జనం బెంబేలెత్తిపోతారు. ఆ సమయంలో అవసరమైన వైద్య పరికరాలు, మందులు అందించడానికి ప్రభుత్వం ఇబ్బంది పడింది. అలాంటి సమయంలో మేమున్నామంటూ మానవతా మూర్తులు, దాతలు ముందుకొచ్చి వైద్య పరికరాలు, యంత్రాలు విరాళంగా ఇచ్చారు. అందులో భాగంగా జిల్లాలో అనేక మంది పరిశ్రమల యాజమానులు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారవేత్తలు, ఎన్‌ఆర్‌ఐలు ముందుకొచ్చి ఈ యంత్రాలను అందజేశారు. అలాంటి యంత్రాలను ఎంతో బాధ్యతగా దాచిపెట్టుకోవాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో కరోనా వైద్యపరికరాలు ఉన్నాయా..? ఉంటే ఎక్కడ ఉన్నాయో కూడా వైద్యాధికారులకు తెలియదంటే.. వైద్యాశాఖల పనితీరు ఎంత అధ్వానంగా ఉందో ఇట్టే తెలిసిపోతుంది.

కనిపించని కొవిడ్ వైద్య పరికరాలు

అప్పట్లో వేలాది మంది దాతల సహకారం

సమాచారం చెప్పలేనిస్థితిలో వైద్యాధికారులు

అనంతపురం టౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో బాధితులకు అత్యవసరంగా చికిత్సలు అందించడానికి దాతలు అవసరమైన వైద్యపరికరాలు, యంత్రాలు కొనుగోలు చేసి వైద్యశాఖలకు అందజేశారు. అధికారుల రికార్డుల ఆధారంగా 8,341 వైద్య పరికరాలు అందించారు. అందులో ముఖ్యంగా.. బీఐ పీపీపీ అండ్ వీ-పీపీపీ 73, ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్ (5ఎల్) 725, ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్(10ఎల్) 30, సీ-పీపీపీ 5, ఈసీజీ యంత్రాలు 5, డెఫిబ్రిలియేటర్స్3, మల్టిపారమానిటర్స్ 20, ఐఆర్ థర్మామీటర్స్ 2196, ఫింగర్‌ట్రిప్ పల్స్ ఆక్సీమీటర్స్ 2,950, హ్యాండ్‌హెల్డ్ పల్స్ ఆక్సీమీటర్స్ 82, సిరంజ్ పంప్స్ 40, సక్షన్ అపార్టస్ 20, ఆక్సిజన్ సిలిండర్స్ 1666, ఆక్సిజన్ ఫ్లోమీటర్స్ 500, ట్రాన్స్‌పోర్ట్ వెంటిలేటర్స్ 5, సీ-పీపీపీ పీడియాట్రిక్స్ 10, వీడియో బ్రాంకోస్కోప్ మానిటర్స్ 6, ఎక్స్‌రే100ఎంఏ, వీడియో లార్యాంగోస్కోప్ ఒక్కొక్కటి, డిస్పోజబుల్ బ్లేడ్స్ 5 కరోనా సమయంలో దాతలు అందించారు. ఈ యంత్రాలను జిల్లా ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ, క్యాన్సర్ యూనిట్, సీహెచ్‌సీలలో ఏర్పాటు చేసిన కొవిడ్ చికిత్స సెంటర్లకు అందజేశారు. మరోవైపు తాడిపత్రి, సూపర్‌స్పెషాలిటీలో జర్మనీషెడ్లు ఏర్పాటుచేసి కరోనా బాధితులకు చికిత్సలు అందించారు. అక్కడ కూడా మెగా కంపెనీ నుంచి కోట్లు విలువచేసే వైద్యపరికరాలు విరాళంగా అందజేసింది. ఆ పరికరాలు ఉన్నాయా లేదా మాయమైపోయాయా అనేది అర్థంకావడంలేదు. ఆయా వైద్యశాఖల అధికారులు సైతం వీటి గురించి అడిగితే ఏదో సమాచారం చెప్పి తప్పించుకుంటున్నారు.



జిల్లా ఆసుపత్రిలోని గోదాములో అట్టపెట్టెలో నిల్వ ఉంచిన ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్స్

మాకు సంబంధం లేదు



కరోనా సమయంలో ఇచ్చిన వైద్య పరికరాల గురించి మాకు సంబంధంలేదు, డీసీహెచ్ఎస్, జీజీహెచ్‌లకు మాత్రమే వాటిని అందజేశారు. అవి ఏమిటో కూడా మాకు తెలియదు. ఒక వేళ సమాచారం తెలుసుకొని చెప్పమంటే చెబుతా.

– డాక్టర్ ఈవీ దేవి, డీఎంహెచ్ఓ

ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్స్‌ను వాడుతున్నాం



కరోనా సమయంలో దాతలు వివిధ రకాల వైద్యపరికరాలు ఇచ్చిన విషయం వాస్తవమే. అందులో ఆక్సిజన్ కాన్‌సన్‌ట్రేటర్స్‌ను ఆసుపత్రి గోడౌన్‌లో ఉంచాం. రోగులకు అవసరమైనపుడు వాటిని వినియోగిస్తున్నాం. మిగిలినవాటి గురించి నాకు పూర్తిగా తెలియదు.

– డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్

దొరికిన వాటిని దాచిపెట్టాం



నేను వచ్చిన తర్వాత పంగల్‌రోడ్డు నందుగల డీఆర్‌డీఏ శాఖకు చెందిన సమావేశ మందిరంలో ఎన్నికల డ్యూటీ వేశారు. ఆ సమయంలో అక్కడికి వెళితే కరోనాకు వినియోగించిన వైద్యపరికరాలు ఉన్నాయని తెలిసింది. వాటిని తీసుకొచ్చి పాతూరు సీడీ ఆసుపత్రిలో దాచి ఉంచాం. మిగిలిన పూర్తి సమాచారం తెలియాలంటే డీఎంహెచ్ఓ కార్యాలయం వాళ్లనే అడగాలి.

– డాక్టర్ పాల్ రవికుమార్, డీసీహెచ్ఎస్



యోగా అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి యోగా అవార్డులకు అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ అధికారి ఉదయ్‌భాస్కర్ తెలిపారు. యోగా ప్రచారం, యోగా అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేసిన వ్యక్తులు, సంస్థలు, జాతీయ వ్యక్తి, జాతీయ సంస్థలు, అంతర్జాతీయ సంస్థల విభాగాలవారీగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు కనీసం 20 ఏళ్లుగా యోగా సేవలో ఉంటూ, వయస్సు 40ఏళ్లలోపు ఉండాలని తెలిపారు. ఈనెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు ఫోన్ నంబరు 08554-315632లో సంప్రదించాలని కోరారు. వెబ్‌సైట్@http://innovateindia.mygov.in/pm-yoga-awards-2025

భద్రం బాబూ..



తీగ చింత తినేందుకు రుచిగానే ఉండొచ్చు..! పట్టు తప్పితే .. పరిస్థితి ఏమిటో ఒక్కసారి ఆలోచించు..!

(అనంతపురం నగర శివారులోని హెచ్చెల్సీ పైప్ లైన్ మీద నిలబడి తీగ చింతకాయలు కోసేందుకు చిన్నారుల పాట్లు.. పీట్లు)

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



తీగ చింత కాయలు

ఎంపీపీల ఎన్నిక వాయిదా

(3వ పేజీ తరువాయి..)

ఎన్నికల కమిషనర్ ఇచ్చే నోటిఫికేషన్ ఆధారంగా ఈ రెండు స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని స్పష్టం చేశారు.

బంగ్లాలో జడ్పీ చైర్‌పర్సన్ హౌస్ అరెస్టు

జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఉమ్మడి జిల్లాలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో గురువారం ఆమె పెనుకొండ, రామగిరి ప్రాంతాల్లో వైసీపీ నాయకులతో కలిసి హడావుడి చేశారు. పెనుకొండలో మాజీ మంత్రి ఉష శ్రీచరణ్‌తో కలిసి రోడ్డుపై ధర్నా చేశారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆమెను టూ టౌన్ పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. దీంతో వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి పార్టీ నాయకులతో కలిసి ఆమెను పరామర్శించారు.

బలమున్నా వైసీపీ గైర్హాజరు డ్రామా

రామగిరి, గాండ్లపెంట ఎంపీపీ స్థానాల ఎన్నికల్లో పోటీ పడలేక వైసీపీ గైర్హాజరు డ్రామాకు తెరలేపింది. ఈరెండు స్థానాల్లో వైసీపీకి అత్యధిక స్థానాలున్నా తమ సభ్యులను పోటీలో నిలబెట్టలేదు. ఎన్నికల కేంద్రంలోకి వెళితే తమ పార్టీ ఎంపీటీలు చేజారిపోతారేమోనన్న ఆందోళనతో అధికార పార్టీపై ఆరోపణలు గుప్పించి ఎన్నికకు గైర్హాజరైంది. గాండ్లపెంటలో ఏడు స్థానాల్లో ఆరు వైసీపీవే కాగా ఇద్దరు ఎంపీటీసీలు కూటమివైపు నిలబడ్డారు. ఇక్కడ నలుగురు ఎంపీటీసీలను వైసీపీ క్యాంపులో పెట్టుకున్నా ఎన్నికలను ఎదుర్కోలేకపోయారు. కూటమి పార్టీలపై ఆరోపణలు చేసి ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు కదిరిలో వీడియోలు రిలీజ్ చేశారు. రామగిరిలో 10 ఎంపీటీసీ స్థానాల్లో 9 వైసీపీకాగా, ఒక్క స్థానంలో టీడీపీ నెగ్గింది.



గాండ్లపెంటలో హాజరైన ముగ్గురు టీడీపీ సభ్యులు

శుక్రవారానికి వైసీపీ బలం ఐదుగురికి పడిపోంది. ఇక్కడ ఐదుగురు సభ్యులు ఉంటే ఎంపీపీ స్థానం ఎన్నికకు కోరం సరిపోతుంది. అయినా ఎన్నికల్లో పాల్గొనకుండా తమిళనాడు రాష్ట్రం రామేశ్వరంలో ఉన్నట్లు ఐదురుగు వైసీపీ ఎంపీటీసీలతో వీడియోలు విడుదల చేయించి సోషల్ మీడియాలో వైరల్ చేసింది. వారంతా ఎన్నికలకు గైర్హాజరయ్యారు. ఈఎన్నికల్లో వైసీపీ పక్కా ప్రణాళికతో తమ సభ్యులను క్యాంపులకు తరలించి ఎన్నికల నిబంధనలు అడ్డుపెట్టుకుని చివరకు గైహాజరు డ్రామా ఆడినట్లు స్పష్టంగా కన్పిస్తోంది.

బాణసంచా పేల్చిన టీడీపీ శ్రేణులు

ఎంపీపీ ఎన్నిక వాయిదా పడిందని తెలియడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు రామగిరిలో బాణసంచా పేల్చుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు రామ్మూర్తినాయుడు, సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి వైసీపీ సభ్యులు టీడీపీ వైపు ఆకర్షితులయ్యారన్నారు. వైసీపీ వారి వద్ద ఉన్న ఐదుగురు సభ్యులు తమవైపు వస్తారన్న అనుమానంతో వారిని ఎన్నికకు హాజరుకాకుండా చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉండి చేసిన అభివృద్ధి ఏమీలేదన్నారు. ప్రకాశ్‌రెడ్డి చేత కాని వ్యక్తి అని, అందుకే ఆయన సభ్యులను ఎన్నికకు దూరంగా తీసుకెళ్లారని ఆరోపించారు.

విచారణతో వణుకు..!

ఆడుదాం.. ఆంధ్రాలో అడ్డగోలుగా అవినీతి

రూ.లక్షలు స్వాహా


అప్పటి డీఎస్ఏ చీఫ్ కోచ్‌పై ఆరోపణలు

ఏసీబీ ఎంక్వైరీకి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం

అక్రమార్కుల గుండెల్లో రైళ్లు



నాసిరకంగా ఉన్న ఆడుదాం ఆంధ్రా క్రికెట్ సామగ్రి



నార్పల స్టేడియంలో ఓ గదిలో ఉంచిన ఆడుదాం ఆంధ్రా కిట్లు



నాసిరకంగా ఆడుదాం ఆంధ్రా బ్యాడ్మింటన్ ర్యాకెట్లు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఆడుదాం ఆంధ్రా పేరుతో నిర్వహించిన క్రీడాపోటీలు.. అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. అవినీతి, పార్టీ ప్రచారానికే పోటీలు నిర్వహించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దోపిడీయే లక్ష్యంగా ప్రక్రియ సాగించారు. క్రీడాకారులకు నీరు కూడా ఇవ్వకున్నా.. ఏకంగా భోజనాలు పెట్టినట్లు బిల్లులు కాజేశారు. అత్యంత నాసిరకం క్రీడా కిట్లతో నిధులు దిగమింగారు. ప్రైజ్‌మనీ అన్నింటా అక్రమాలే. వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు వేసిన ఈ స్టంట్‌లో అడ్డగోలుగా దోచుకుతిన్నారు. ఈ వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఆడుదాం ఆంధ్రా నిర్వహణలో ఏసీబీ విచారణకు ఆదేశించడంతో అప్పట్లో అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడిన వారిలో వణుకు మొదలైంది.

సొంత ప్రచారం

గత వైసీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లపాటు క్రీడాభివృద్ధిని గాలికొదిలేసింది. ఎన్నికలకు ముందు 'ఆడుదాం.. ఆంధ్రా' అంటూ యువతను మభ్యపెట్టే ప్రయత్నం చేసింది. టీ షర్టులతో మొదలు వైసీపీ రంగులు, జగన్ బొమ్మలతో సొంత ప్రచారం చేసుకుంది. నాసిరకంగా కిట్లు, ఈవెంట్ నిర్వహణ నిర్వీర్యం, ముగింపు పోటీలు, ప్రైజ్‌మనీ ఇలా అన్నింటా నిధులు భారీగా దుర్వినియోగం చేశారు. అప్పటి డీఎస్‌డీఓ జేబులు ఫుల్లుగా నింపుకున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

సగం స్వాహా...

ఆడుదాం.. ఆంధ్రా పోటీల నిర్వహణకు జిల్లాకు రూ.1.20 కోట్లు కేటాయించారు. అప్పట్లో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ) చీఫ్ కోచ్‌గా పనిచేసిన నరసింహారెడ్డి అందులో సగం రూ.60లక్షల వరకు కాజేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమాలు బయటపడకముందే అప్పటి వైసీపీ ప్రభుత్వ పెద్దల అండదండలతో విజయవాడకు బదిలీ చేయించుకుని వెళ్లారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల నిర్వహణ, నిధుల గోల్‌మాల్‌పై ప్రభుత్వానికి, పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలోనే అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. నిధులు స్వాహాలో డీఎస్‌డీఓతోపాటు ఎవరెవరి పాత్ర ఉంది, అధికారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉందా అనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏసీబీ విచారణలో భారీఎత్తున అక్రమాలు వెలుగుచూసే అవకాశాలున్నాయన్న చర్చ సాగుతోంది. గుంటూరు జిల్లా డీఎస్‌డీఓగా బదిలీపై వెళ్లిన తరువాత ఆయన సుమారు పదిసార్లు జిల్లాకు రహస్యంగా వచ్చి వెళ్లినట్లు సమాచారం. అక్రమాలు బయటకు పొక్కకుండా సర్దుబాటు చేసుకోవడానికే వచ్చి వెళ్లినట్లు తెలుస్తోంది.

సామగ్రిని నిల్వ ఉంచాం



విచారణకు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి ప్రస్తుతానికి సమాచారం లేదు. ఆడుదాం ఆంధ్రా పోటీలకు తెప్పించిన క్రీడాసామగ్రిని నిల్వ ఉంచాం.

– ఉదయ్‌భాస్కర్, డీఎస్‌డీఓ

ఎస్సీ సబ్సిడీ రుణాలపై కసరత్తు



ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ రాధిక

ఎస్సీ సబ్సిడీ రుణాలపై కసరత్తు ప్రారంభించినట్లు ఎస్సీ సంక్షేమశాఖ ఉప సంచాలకురాలు (డీడీ), ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కూడా అయిన రాధిక చెబుతున్నారు. సంక్షేమ వసతిగృహాల్లో వసతుల కల్పనపై దృష్టి సారిస్తున్నామన్నారు. ఎస్సీ సంక్షేమ శాఖ, కార్పొరేషన్‌ను సమన్వయంతో నడిపిస్తూ ఎస్సీ వర్గాలకు పథకాలను చేరువ చేయడమే లక్ష్యం అంటున్న ఆమెతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

ఇంటర్వ్యూ interview

ప్రశ్న: పదో తరగతి పరీక్షలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు..?

జవాబు: ఏఎస్‌డబ్ల్యూఓలు, వార్డెన్లు రాత్రివేళల్లో హాస్టళ్లలో బస చేయాలని ఆదేశాలు జారీ చేశాం. ఈసారి పదో తరగతి ఫలితాల్లో ఎస్సీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులందరూ పాసయ్యేలా చర్యలు చేపట్టాం.

ప్రశ్న: హాస్టళ్లలో వసతులెలా ఉన్నాయి..?

జవాబు: జిల్లాలోని అన్ని వసతి గృహాల్లో వసతుల కల్పనకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే శిథిలావస్థకు చేరిన భవనాల మరమ్మతులు చేపడుతున్నాం. తాజాగా ప్రతి హాస్టల్‌కు వంట సామగ్రి పంపిణీ చేశాం. విద్యార్థులకు దుప్పట్లు, ఆట వస్తువులు పంపిణీ చేశాం.

ప్రశ్న: ఎస్సీ కార్పొరేషన్‌లో రికవరీలు ఎలా సాగుతున్నాయి..?

జవాబు: ఎస్సీ కార్పొరేషన్‌లో 2014-19 మధ్య కాలంలో అమలైన పథకాలకు సంబంధించి రికవరీల విషయంలో రాజీపడటం లేదు. ఇప్పటికే ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ, ఎన్ఎస్ఎఫ్‌డీసీ పథకాల కింద లబ్ధిపొందిన వారి నుంచి రికవరీలకు క్షేత్రస్థాయిలో అధికారులను పంపుతున్నాం. రికవరీలు చేస్తున్నాం.

ప్రశ్న: ఎస్సీ సబ్సిడీ రుణాల పరిస్థితేంటి?

జవాబు: ఎస్సీ కార్పొరేషన్‌లో ఈ ఏడాదికి సంబంధించి సబ్సిడీ రుణాల ప్రక్రియపై కసరత్తు సాగుతోంది. యూనిట్ల వారీగా రుణాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే సబ్సిడీ రుణాలకు సంబంధించిన విధివిధానాలు ప్రకటిస్తాం.

– ఆంధ్రజ్యోతి, అనంతపురం ప్రెస్‌క్లబ్

క్రైం కార్నర్

పేట్రేగిపోయిన దొంగలు

● పలువురి పొలాల్లో కేబుల్‌వైరు చోరీ



కేబుల్ వైరు కత్తిరించుకెళ్లిన దృశ్యం

యాడికి, మార్చి28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువు, పెద్దపేట గ్రామాల పరిధిలో గురువారం రాత్రి దొంగలు పేట్రేగిపోయారు. పలువురు రైతుల పొలాల్లో కేబుల్ వైరు అపహరించుకెళ్లారు. పరిమి చరణ్ అనే రైతుకు చెందిన నాలుగు వ్యవసాయ బోరుబావుల వద్ద సుమారు 100 మీటర్ల కేబుల్ వైరును కత్తిరించుకెళ్లినట్లు బాధిత రైతు తెలిపారు. దీని విలువ రూ.10 వేలు ఉంటుందన్నారు. సమీపంలోని 8 మంది రైతుల బోరుబావుల కేబుల్ వైరు కూడా దొంగలు కత్తిరించుకెళ్లినట్లు తెలిసింది. పంటలు పండక తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో చోరీల కారణంగా మరింత నష్టపోతున్నామని దొంగలు ఆవేదన చెందుతున్నారు. జనవరి నుంచి పరిమి చరణ్ వ్యవసాయ బోరుబావుల వద్దే ఎనిమిది సార్లు కేబుల్‌వైరు చోరీ చేసినట్లు రైతు వాపోయాడు. దీంతో బోరుబావుల వద్ద సీసీ కెమెరాలు అమర్చినా దొంగలు యథేచ్ఛగా కేబుల్‌వైరు చోరీ చేస్తున్నారని ఆవేదన చెందాడు. వీటిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టడం లేదని వాపోయాడు. పోలీసులు స్పందించి కేబుల్‌వైరు దొంగలపై చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మడ్డిపల్లిలో..

పుట్లూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని మడ్డిపల్లి శివారులో ఏడుగురు రైతులకు సంబంధించి వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్‌వైర్లను శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో వైర్లను కట్‌చేసి ఎత్తుకెళ్లారు. ఒక్కో రైతు పొలంలో సుమారు 10 మీటర్ల మేర కట్‌చేసి, ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. వీటిపై పోలీసులకు రైతులు ఫిర్యాదు చేయలేదు.

ఈతకెళ్లి యువకుడి మృతి



భరత్ (ఫైల్)

కణేకల్లు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లికి చెందిన భరత్(19) శుక్రవారం ఈతకెళ్లి మృతిచెందాడు. శ్రీనివాసులు, పార్వతి దంపతుల రెండో కుమారుడు భరత్ మిత్రులతో కలిసి గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలోకి ఈతకెళ్లాడు. ఈతలో భాగంగా గట్టుపై నుంచి బావిలోకి దూకిన భరత్ పైకి రాలేదు. మిత్రులు గాలిస్తుండగా.. కాసేపటికి శవమై తేలాడు. సమాచారం అందుకున్న పోలీసులు.. మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టంకి తరలించారు.

గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య

సోమందేపల్లి, మార్చి28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకర్లపల్లి వద్ద రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. శుక్రవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించారు. దేహం ఛిద్రమైంది. యువకుడి వయసు 20 ఏళ్లు ఉంటుందనీ, నీలి రంగు షర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. ఆచూకీ తెలిస్తే సోమందేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

6న శ్రీవారి ఆలయంలో శ్రీరామనవమి ఆస్థానం

● 7న శ్రీరామ పట్టాభిషేకం

తిరుమల, మార్చి28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 6వ తేదీన శ్రీరామనవమి ఆస్థానం నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రంగనాయకుల మండపంలో సీతారామలక్ష్మణ సమేత హనుమంత స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేస్తారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు హనుమంత వాహనంపై శ్రీరాముడు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తారు. రాత్రి 9 నుంచి 10 గంటల మధ్య ఆలయంలోని బంగారు వాకిలి వద్ద శ్రీరామనవమి ఆస్థానాన్ని వేడుకగా నిర్వహిస్తారు. ఇక, 7వ తేది రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య బంగారు వాకిలి వద్ద ఆలయ అర్చకులు శ్రీరామపట్టాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. కాగా, ఏప్రిల్ నెలలో 10 నుంచి 12వ తేదీ వరకు వసంతోత్సవాలు, 12న పౌర్ణమి గరుడసేవ, తుంబురతీర్థ ముక్కోటి, 23న భాష్యకార్ల ఉత్సవం, 30న అక్షయతృతీయ వంటి పర్వదినాలనూ నిర్వహించనున్నారు.

సబ్సిడీ ఉలవ పంపిణీలో అక్రమాలపై విచారణ

● అధికారుల నియామకం

● వారం రోజుల్లో నివేదికలు సమర్పించాలని ఉత్తర్వులు

అనంతపురం అర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): 2024-25 ఖరీఫ్‌లో సబ్సిడీ ఉలవ విత్తనాల పంపిణీలో అక్రమాలపై విచారణకు చర్యలు చేపట్టారు. ఉమ్మడి అనంత జిల్లాలో 80 శాతం సబ్సిడీతో ఉలవ విత్తనాలు పంపిణీ చేశారు. అనంతలో 9,720 క్వింటాళ్లు, శ్రీసత్యసాయి జిల్లాలో 14,484 క్వింటాళ్ల ఉలవ విత్తనాలను సబ్సిడీతో పంపిణీ చేశారు. ఇందులో కొందరు అధికారులు కుమ్మక్కై రైతుల పేర్లతో ఉలవ విత్తనాలను బయట మార్కెట్‌కు తరలించారన్న ఆరోపణలు వినిపించాయి. వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు సైతం ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో కమిషనర్ ఢిల్లీరావు విచారణకు ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ చేసేందుకు పక్క జిల్లా వ్యవసాయాధికారులను నియమించారు. వారం రోజుల్లో విచారణ పూర్తి చేసి, నివేదికలు సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో క్షేత్రస్థాయిలో ఉలవ పంపిణీపై విచారించేందుకు పెనుకొండ ఏడీఏ స్వయంప్రభ, హిందూపురం ఏఓ చైతన్య, మడకశిర ఏడీఏ కృష్ణమీనన్, మడకశిర ఏఓ ఎలిజబెత్, కదిరి ఏడీఏ సత్యనారాయణ, కొత్తచెరువు ఏఓ శ్రీవాణి, ధర్మవరం ఏడీఏ కృష్ణయ్య, ఏఓ మంజులతను నియమించారు. శ్రీసత్యసాయి జిల్లాలో విచారించేందుకు అనంతపురం జిల్లా భూసార సంరక్షణా విభాగ డీడీఏ శివప్రసాద్, ఏఓ అర్చనాదేవి, ఎఫ్‌సీఓ ల్యాబ్ ఏఓ ఆదిలక్ష్మి, భూసార పరీక్షా కేంద్రం ఏడీఏ రోజాపుష్పలత, ఏఓ ఉమామహేశ్వరి, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏలు పద్మలత, శైలజాకుమారి, క్రిమిసంహారక మందుల పరీక్షాకేంద్రం ఏఓ జ్యోత్స్నను నియమించారు. ఉమ్మడి జిల్లాల జేడీఏలు విచారణ బృందాలకు పలు మండలాలను కేటాయించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఒక్కో బృందం 150 మంది రైతులను క్షేత్రస్థాయిలో సబ్సిడీ ఉలవ పంపిణీపై విచారించాలని ఆదేశించారు. వారం రోజుల్లో విచారణ పూర్తి చేసి, నివేదికలు సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ మేరకు ఆయా విచారణాధికారులు ఏయే మండలాల్లో క్షేత్ర స్థాయిలో విచారణ చేయాలన్నది నిర్ణయించారు. త్వరలోనే ఆయా అధికారులు విచారణ చేయనున్నారు.

పాడికీ వేడి ముప్పు..!

వేసవిలో వడదెబ్బ బారిన పడే ప్రమాదం

● నిర్లక్ష్యం చేస్తే మరణించే అవకాశం

● సకాలంలో రక్షణ చేపట్టాలంటున్న పశువైద్యాధికారులు



చెట్టు నీడన కట్టేసిన గేదెలు

కదిరి అర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్న సమయంలో జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఎక్కడ వడదెబ్బ బారిన పడతామోనని బెంబేలెత్తుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చినా.. ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మనుషులకు ఇవన్నీ సాధ్యపడుతున్నాయి. మరి.. పాడి పశువుల పరిస్థితి ఏంటి? ఇవి కూడా ఎండ వేడిమికి వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉందని పశువైద్యాధికారులు చెబుతున్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే పాడి పశువులు మృతిచెందే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

తగ్గనున్న పాల దిగుబడి

గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 60నుంచి 70శాతం మంది రైతులు పంటల సాగుతోపాటు పాడిపై దృష్టి సారిస్తారు. పాడి పశువుల సంరక్షణలో మెలకవలు తెలియక, వాటి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోక నష్టాల పాలవుతుంటారు. పాడి పశువులకు వడదెబ్బ తగిలితే పాల దిగుబడి తగ్గుతుందని పశువైద్యులు చెబుతున్నారు. పాడి పశువులు యదకు వచ్చే పరిస్థితులు కనిపించవనీ, చుడి కట్టే అవకాశాలుండవని వారు పేర్కొంటున్నారు. వేసవిలో పాడి ఆవులు, గేదెల సంరక్షణలో రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోతే వడదెబ్బ బారినపడి, పశువుల ప్రాణాలు కోల్పోయే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు ఇవీ..

వేసవిలో పశువులు తాగే నీరు స్వచ్ఛంగా, పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. సహజంగా వేసవిలో నీటి వనరులు తగ్గి నిలువ ఉండే నీరు మురికిగా, ఆకుపచ్చగా మారుతుంది. పశువులు ఈ నీటిని తాగితే వ్యాధికారక క్రిములు శరీరంలో చేరుతాయి. వ్యాధులకు కారణమవుతాయి. పశువులు తాగేందుకు స్వచ్ఛమైన నీరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. రోజులో కనీసం రెండు, మూడుమార్లు నీటిని అదించాలి. ఆరుబయట తొట్టిలో పగలు నిలువ ఉన్న నీరు ఎండకు వేడెక్కుతాయి. నీడ ప్రాంతంలో నిలువ ఉంచిన చల్లని నీటిని మాత్రమే పశువులకు తాగించాలి. ఆవులతో పోల్చితే గెదెలు ఎక్కువ నీటిని తాగుతాయి. వాతావరణ ఉష్ణోగ్రత, గాలిలో తేమ, పశువు వయసు బట్టి రోజుకు దాదాపు 25 లీటర్ల నీరు అవసరం.



ఆవును నీటితో కడుగుతున్న మహిళా రైతు

ఇలా.. తెలుసుకోవాలి..

పశువులకు వడదెబ్బ తలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యులు సూచిస్తున్నారు. పశువుల పాక చుట్టూ పాత గోనె సంచులు కట్టి వాటిని అప్పుడప్పుడు తడుపుతూ ఉండాలి. పైకప్పును టెంకాయ పట్టలు, కానుగ ఆకులతో కప్పాలి. పశువులను ఉదయం, సాయంత్రం చల్లటి వాతావరణంలో మేత కోసం తిప్పాలి. వీలైనంత వరకు పచ్చని మేత ఇవ్వాలి. వడదెబ్బ బారిన పడిన పశువుల లక్షణాలను పరిశీలిస్తే శరీర ఉష్ణోగ్రత 101 నుంచి 108 డిగ్రీల వరకు పెరుగుతుంది. పశువులు నడిచేటపుడు తూలుతాయి. శ్వాస ఎక్కువగా తీసుకుంటుంటాయి. చాలా నీరసంగా కనిపిస్తాయి. చర్మం ఎండిపోతుంది. పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. ఈ లక్షణాలుంటే వడదెబ్బ తగిలిందని గ్రహించాలి.

ప్రథమ చికిత్స

వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే ప్రదేశంలోకి తీసుకెళ్లి శరీర ఉష్ణోగ్రతలు తగ్గించడానికి పలుమార్లు నీటితో కడగాలి. నీటితో తడిపిన గోనెసంచెను దానిపై కప్పాలి. తక్షణం పశువైద్యులను సంప్రదించి, గ్లూకోజ్ సిలెన్, సోడియం క్లోరైడ్ అందించాలి. వైద్యుల పర్యవేక్షణలో శరీర ఉష్ణోగ్రతలు తగ్గించడానికి చికిత్స చేయించాలి.

రక్షణ చర్యలు చేపట్టాలి



వేసవిలో పాడి పవువులకు వడదెబ్బ తగలకుండా వీలైనంతవరకు రక్షణ చర్యలు తీసుకోవాలి. అధిక ఉష్ణోగ్రతలు, గాలి ప్రసరణ తక్కువగా ఉండడం, షెడ్లలో ఎక్కువ పశువులు ఉండడం కారణంగా ఉక్కపోత, నీటి సౌకర్యం తక్కువగా ఉండడం వలన పశువులు వడదెబ్బ బారిన పడతాయి. ఆవుల కంటే గేదెలు వడదెబ్బ బారిన పడే అవకాశాలు ఎక్కువ. గేదెలు నల్లగా ఉండడం కారణంగా వాటిపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. పశువులను రోజుకు రెండు మూడుమార్లు కడగాలి. వేసవిలో వ్యాధి నిరోధక శక్తి తగ్గడం కారణంగా ఇతర సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉంది. కావున వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.

- శ్రీనివాసరెడ్డి, పశు సంవర్ధక శాఖ ఏడీ, కదిరి

తెలంగాణ ప్రజలకు మంచి దర్శనం చేయిస్తున్నారు

● చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి



ఆలయం ముందు పట్నం మహేందర్‌రెడ్డి

తిరుమల, మార్చి28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు తీసుకుని టీటీడీ మంచి దర్శనం చేయిస్తోందని ఆ రాష్ట్ర శాసనమండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డి సంతోషం వ్యక్తంచేశారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై ఈనెల 24వ తేదీ నుంచి దర్శనం కల్పిస్తుండటం చాలా సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ప్రజలు కూడా చాలా ఆనందంగా ఉన్నారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు ఇంకా అభివృద్ధి చెందాలని, స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ బాగుండాలని కోరుకున్నట్లు చెప్పారు.

వట్టిపోతున్న ఆశలు..!

● మూడేళ్లుగా కాలువకు నీరు బంద్

● ప్రశ్నార్థకంగా 4 వేల ఎకరాల ఆయకట్టు

● అడుగంటుతున్న బోరుబావులు

● 17 గ్రామాల్లో తాగునీటి ఎద్దడికి అవకాశం



29వ డిస్ట్రిబ్యూటరీ కాలువ

పుట్లూరు, మార్చి28(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలకుల పాపం.. రైతులకు శాపంగా మారింది. కాలువను ఎండబెట్టి, ఆయకట్టును ప్రశ్నార్థకంగా చేశారు. మండలంలోని సుబ్బరాయసాగర్ డ్యాం నుంచి ప్రారంభమయ్యే 29వ డిస్ట్రిబ్యూటరీ కాలువకు మూడేళ్లుగా నీరు విడుదల చేయలేదు. దీంతో ఆయకట్టులో పంటల సాగు కష్టమవుతోంది. బోర్లలో భూగర్భ జలమట్టం తగ్గిపోయి, సాగు, తాగునీటి కష్టాలు తలెత్తుతున్నాయి. కొత్త ప్రభుత్వమైనా కనికరించకపోతుందా అని అన్నదాతలు ఆశగా చూస్తున్నారు.

వైసీపీ పాలకుల నిర్లక్ష్యం

సుబ్బరాయసాగర్ నుంచి 29వ డిస్ట్రిబ్యూటరీ కాలువ మొదలవుతుంది. కాలువ కింద పుట్లూరు, యల్లనూరు మండలాల పరిధిలో 4 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఏటా కాలువకు హెచ్చెల్సీ నీరు విడుదల చేసేవారు. తద్వారా ఆయకట్టులో రైతులు పంటలు పండించుకునేవారు. తాగునీటికి కూడా ఇబ్బంది ఉండేది కాదు. 2019లో వైసీపీ అధికారం చేపట్టాక కాలువకు నీటి విడుదలపై నిర్లక్ష్యం చేశారు. మూడేళ్లపాటు చుక్క కూడా నీరు వదల్లేదు. దీంతో కాలువ వట్టిపోయింది. ఆయకట్టు భూముల్లో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. కాలువ పరిధి గ్రామాల్లో భూగర్భ జలమట్టం పడిపోతోంది. దీంతో బోరుబావులు ఎండిపోతున్నాయి. గత మూడేళ్లలో వర్షాలతోనే బోర్లు కొంతమేర రీచార్జ్ అయి, అరకొరగా నీరు వస్తోంది. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు విపరీతంగా నమోదవుతుండడంతో అరకొర నీటితో పంటలకు తడులు ఇవ్వడం కష్టమవుతోందని రైతులు వాపోతున్నారు. సుబ్బరాయసాగర్ డ్యాంలోకి అరకొరగా వచ్చిన నీటినే తాగునీటి అవసరాల కోసం పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులకు విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీంతో 29వ డిస్ట్రిబ్యూటరీకి నీటిని విడుదల చేస్తారని ఆశపడిన రైతులకు చుక్కెదురైంది. కనీసం ఈ ఏడాదైనా నీరు విడుదల చేస్తే బోర్లు రీచార్జ్ అవుతాయన్న ఆశలు ఆవిరయ్యాయి. బోర్లలో అరకొరగా వచ్చే నీటితోనే పంటలకు తడులు అందిస్తున్నామని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం పంటలు ఎండుముఖం పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రశ్నార్థకం

సుబ్బరాయసాగర్ కుడివైపున ఉన్న 29వ డిస్ట్రిబ్యూటరీ కాలువ కింద సుమారు 4 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో అరటి, దానిమ్మ, మొక్కజొన్న, చీనీ, బొప్పాయి తదితర పంటలు సాగుచేసుకుంటున్నారు. ఈ కాలువ కింద ముఖ్యంగా అరటి ఎక్కువగా పెట్టారు. వేసవిలో అరటికి ఎక్కువ తడులు ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో బోర్లలో అరకొరగా వచ్చే నీటితో పంటను కాపాడుకోలేకపోతున్నామని రైతులు దిగులు చెందుతున్నారు. కడవకల్లు, ఓబులాపురం, దోసలేడు, చెర్లోపల్లి, కొండుగారికుంట, రంగరాజుకుంట, కుమ్మనమల, రంగమనాయునిపల్లి తదితర గ్రామాల్లో అరటి ఎక్కువగా సాగుచేస్తున్నారు. బోర్లలో నీరు అడుగంటి, పంటలకు తడులు అందక ఎండుముఖం పడుతున్నాయి. వాటితోపాటు గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తుతోంది. కొత్త ప్రభుత్వమైనా 29వ డిస్ట్రిబ్యూటరీకి నీరు వదిలి, పంటలను బతికించాలని రైతులు కోరుతున్నారు.

నీరు వస్తే బోర్లు రీచార్జి అవుతాయి



కాలువకు నీరు వస్తే వ్యవసాయ బోర్లు రీచార్జి అవుతాయి. బోర్లలో ప్రస్తుతం అరకొరగా నీరు వస్తోంది. మూడేళ్ల నుంచి కాలువకు నీరు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది అరటితోటల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

- గోవిందు, చెర్లోపల్లి, పుట్లూరు మండలం

తాగునీటి సమస్య తలెత్తే అవకాశం



కాలువకు మూడేళ్లపాటు నీరివ్వకపోవడంతో ఈ ఏడాది తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉంది. వెంటనే 29వ డిస్ట్రిబ్యూటరీ కాలువకు నీరు విడుదల చేయాలి. లేకపోతే బోర్లు అడుగంటిపోయి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయి. గతంలో వర్షాలు సమృద్ధిగా రావడంతో ఇబ్బందిలేదు. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో రాకపోవడంతో ఇబ్బంది తలెత్తింది. **- ఓబన్న, కుమ్మనమల, పుట్లూరు మండలం**

దళారులు లేకుండా పంట విక్రయం

● రైతు ఉత్పత్తి సంఘాలతో ఎన్నో ప్రయోజనాలు

● భారత తోటల యాజమాన్య సంస్థ అధ్యాపకులు



రైతులతో ఐఐపీఎం అధ్యాపకులు నరేందర్, రసూల్

కూడేరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తాము పండించిన పంటలను దళారుల అవసరం లేకుండా రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా మార్కెట్‌లో అమ్ముకోవచ్చనని బెంగళూరుకు చెందిన భారత తోటల యాజమాన్య సంస్థ (ఐఐపీఎం) అధ్యాపకులు డా.నరేందర్, డా. రసూల్ పేర్కొన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతులకు గ్రేడింగ్, బ్రాండింగ్, వాల్యూఎడిషన్, మార్కెటింగ్ విధానాలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఐపీఎం అధ్యాపకులు మాట్లాడుతూ.. గ్రామాల్లో రైతు ఉత్పత్తి సంఘాలను ఏర్పాటు చేసుకుని, తద్వారా పంట ఉత్పత్తులను నేరుగా మార్కెట్‌లో ఎలా విక్రయించుకోవాలో వివరించారు. జిల్లాలో వేరుశనగతోపాటు ఉద్యాన పంటలు అధికంగా పండిస్తారని, దళారీలు లేకుండా నేరుగా వివిధ ప్రాంతాల్లోని మార్కెట్లకు ఎగుమతి చేసుకోవడం వల్ల అధిక ధరలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ విజయ్ కుమార్ ఏఈఓ శైలజ, రైతు సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

అంజినప్ప రికార్డు

● ఓరియంటల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు



అవార్డును చూపుతున్న అంజినప్ప

ధర్మవరంరూరల్, మార్చి28(ఆంధ్రజ్యోతి): తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, కళాభిషేకం నిర్వహకులు అంజినప్పకు ఓరియంటల్ బుక్‌ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కింది. కనుమరుగవుతున్న కళా రూపాలకు పూర్వవైభవం తీసుకురావాలనే సంకల్పంతో ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో 221కళాభిషేకం కార్యక్రమాలు పూర్తి చేసినందుకు తనకు ఈ అవార్డు దక్కినట్లు అంజినప్ప తెలిపారు. మండలంలోని నాగలూరు వద్ద ఉన్న పీసీఎంఆర్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన ఈ అవార్డును ఉత్తరప్రదేశ్‌లో జరిగే కార్యక్రమంలో అం దుకోవాల్సి ఉంది. అయితే పదో తరగతి పరీక్షల నేపథ్యంలో ఆయన వెళ్లలేకపోవడంతో ఆ సంస్థ వారే అవార్డును ఇంటికి పార్సిల్‌ద్వారా పంపినట్లు తెలిపారు.

8న ఉద్యాన రైతుల రాష్ట్ర సదస్సు



మాట్లాడుతున్న మల్లికార్జున

అనంతపురం విద్య, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఉద్యాన రైతుల రాష్ట్ర సదస్సు ఏప్రిల్ 8న అనంతపురంలో నిర్వహించనున్నట్లు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి చిరుతల మల్లికార్జున పేర్కొన్నారు. సీపీఐ కార్యాలయంలో ఆ సంఘం నాయకులు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మల్లికార్జున మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా ప్రకటించిందన్నారు. అనంతపురం జిల్లాలో మామిడి, అరటితోపాటు, పూలు, కూరగాయలు ఎక్కువగా పండిస్తున్నారన్నారు. ఉద్యానపంటలకు అనువైన భూములు, పండించే రైతులు ఉన్నా నీటి వనరులు కరువయ్యాయని తెలిపారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవన్నారు. పంటలు సాగు చేసేందుకు 800 అడుగుల మేర ఉచితంగా బోర్లు వేయించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి గ్రామంలో రైతు సేవా కేంద్రాలకు అనుబంధంగా కోల్డ్ స్టోరేజ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. భూసార పరీక్షలు, బోరుబావులకు నీటిసార పరీక్షలు చేసి ఉచితంగా పత్రాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, బండి రామకృష్ణ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు-బళ్లారి సెక్షన్ పరిశీలన



బళ్లారి రైల్వేస్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న డీఆర్ఎం గుప్తా

గుంతకల్లు,మార్చి28(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్‌లోని గుంతకల్లు- బళ్లారి రైల్వే సెక్షన్‌ను డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా శుక్రవారం పరిశీలిం చారు. గుంతకల్లు నుంచి ప్రత్యేక రైలులో బళ్లారికి వెళ్లిన డీఆర్ఎం అక్కడి రైల్వే స్టేషన్ యార్డును తనిఖీ చేశారు. హగిరి గూడ్స్ షెడ్‌ను పరిశీలించారు. వీరాపురం, గుంతకల్లు వెస్ట్ రైల్వే స్టేషన్‌లను భద్రతా ప్రమాణాల విషయంగా సందర్శించారు. అధికారులతో చర్చించిన మీదట బళ్లారి నుంచి గుంతకల్లు వరకూ ప్రత్యేక రైల్‌లో రీర్ విండో ద్వారా ట్రాక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపటి పశువుల సంత బంద్

అనంతపురం రూరల్, మార్చి28(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం నిర్వహించాల్సిన పశువుల సంత బంద్ చేయనున్నట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. రైతులు, వ్యాపారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం సాయంత్రం	సహర్ ఆదివారం ఉదయం
కదిరి:	6.32	4.59
ధర్మవరం:	6.37	4.59

న్యూస్ బాక్స్

అభివృద్ధి పనుల పరిశీలన

ధర్మవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులను బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు శుక్రవారం పరిశీలించారు. ఆస్పత్రిలో జరుగుతున్న సీసీరోడ్లు, కరెంటు, నీటి సరఫరా పైపులైన్ తదితర పనులను ఆయన పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

జాతీయ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక


సాయి త్రినేష్‌గౌడ్

కొత్తచెరువు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సాయి త్రినేష్ గౌడ్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ -14 విభాగంలో జాతీయ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యాడని కొత్తచెరువు ఫుట్‌బాల్ క్లబ్ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయి త్రినేజ్ గౌడ్ మహారాష్ట్ర జీవన సంజీవ్ గ్రాఫ్ ఆఫ్ స్కూల్ పనాహల కొల్హాపూర్‌లో ఏప్రిల్ 25 నుంచి 29 వరకు జరిగే ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. త్రినేజ్‌ను గ్రామస్థులు, తోటి విద్యార్థులు అభినందించారు.

భూముల రీసర్వేను సద్వినియోగం చేసుకోండి

తనకల్లు, మార్చి28 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శోభాసువర్ణమ్మ కోరారు. శుక్రవారం మండలంలోని మల్లిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. గతంలో సర్వేలు నిర్వహించినప్పుడు సక్రమంగా సర్వే టీమ్‌లు పని చేయలేదని ఫిర్యాదులు అందాయన్నారు. దీంతో ప్రభుత్వం తిరిగి భూములసర్వే ప్రారంభించిందన్నారు. రీసర్వే కోసం ఎంపిక చేసిన మల్లిరెడ్డిపల్లి రెవెన్యూ గ్రామంలోని పెద్దపల్లి, వడ్డుమరవపల్లి, నక్కరాళ్లతండా, నడిమికుంటపల్లి, సుబ్బరాయునిపల్లి, గౌళ్లపల్లి, ఎర్రబల్లి గ్రామాలకు సంబంధించిన ప్రజలందరూ రీసర్వేకు సహకరించాలన్నారు. ఈ రీసర్వే కోసం నాలుగు టీమ్‌లను నియమించామన్నారు. రైతులువు తమ వద్ద ఉన్న ఆధారాలతో మీ భూములను సర్వే చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ బాషా, సర్వేయర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

వారపు సంత వేలం

నల్లమాడ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నల్లమాడలో ప్రతి మంగళవారం నిర్వహించే వారపు సంతను సర్పంచ్ రమావత్ భారతి ఆధ్వర్యంలో శుక్రవారం వేలం వేశారు. ఈవేలంలో రూ.30వేలు దరవాత్తు చెల్లించి, ఎనిమిది మంది పాల్గొన్నారు. పెమనకుంటపల్లికి చెందిన రామిరెడ్డి రూ.3.83 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అమరనాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విశ్వనాథ్ రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

సంత వేలం వాయిదా

ఓబుళదేవరచెరువు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఓడీచెరువు సంత వేలం శుక్రవారం జరగాల్సి ఉండగా, వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ తెలిపారు. ఎంపీడీఓ రాబర్టువిల్సన్, ఈఓఆర్డీ కేశవరెడ్డి ఆధ్వర్యంలో సంత వేలం పాట నిర్వహించారు. అయితే నిర్ధేశించిన ధర కంటే తక్కువగా వేలం పాట పాడడంతో, వేలం వాయిదా వేసినట్లు కార్యదర్శి తెలిపారు. సంత వేలంలో సిండికెట్ ఏర్పడం వల్లే నిర్ధేశించిన ధర కంటే తక్కువ పాడారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చట్టాలపై అవగాహన

బుక్కపట్నం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీకాలనీలో సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ షేబ్బుద్దీన్ ప్రజలకు చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఎస్సీఎస్టీ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నారాయణ, వీఆర్‌ఓ సురేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో టీడీపీ కార్యకర్త మృతి

కొత్తచెరువు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరుకుంటపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త రాజశేఖర్ (27) అనారోగ్యంతో శుక్రవారం మరణించాడు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. రాజశేఖర్ భార్య శ్రవంతికి ఆర్థిక సాయం అందజేశారు. మండలకేంద్రానికి చెందిన టీడీపీ మహిళా కార్యకర్త భాగ్యలక్ష్మీ అనారోగ్యానికి చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆమెను కూడా మాజీ మంత్రి పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకుడు సాలక్కగారి శ్రీనివాసులు, నాయకులు ఒలిపి శీనా, గోపాల్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, లోకేశ్, నాయుడు ఉన్నారు.

ప్రధాన సర్కిళ్లలో ట్రాఫిక్ ఆంక్షలు

ధర్మవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పండుగుల సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పట్టణంలోని ప్రధాన సర్కిల్‌ల్లో ట్రాఫిక్‌పై ఆంక్షలు విధిస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. శని, ఆదివారాల్లో పీఆర్‌టీ సర్కిల్ నుంచి అంజుమన్ సర్కిల్ వరకు వాహనాలను అనుమంతించబోమన్నారు. అలాగే కళాజ్యోతి సర్కిల్ నుంచి పీఆర్‌టీ సర్కిల్ వరకు రోడ్డుకు ఇరువైపులా వేసిన లైన్ దాటి ద్విచక్రవాహనాలు రోడ్డు మీదకు వస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తాటిమాను గుంతలో తాగునీటి ఎద్దడి

నంబులపూలకుంట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిమాను గుంతలో నెలరోజుల నుంచి తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని ఆ గ్రామస్థులు వాపోతున్నారు. బోరులో నీరు పుష్కలంగా ఉన్నా.. కొళాయిల ద్వారా నీటిని సరఫరా చేయడం లేదన్నారు. దీంతో గ్రామస్థులు అందరూ ట్యాంక్ వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకుందన్నారు. నీటిని తెచ్చుకోవడానికే సమయం సరిపోతోందని, పనులకు వెళ్లలేకపోతున్నామని వాపోయారు. గ్రామంతా మూగజీవాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, వాటి దాహార్తిని తీర్చడానికి ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. సమస్యను అధికారులు, నాయకులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.


ట్యాంక్ వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్థులు

అంతా మా ఇష్టం..!





అధికారుల కోసం చెట్ల కింద నిరీక్షిస్తున్న రైతులు, ప్రజలు, 11 గంటలైనా కార్యాలయానికి రాని వీఆర్‌ఓలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది

ధర్మవరం తహసీల్దార్ కార్యాలయంలో కొరవడిన సమయపాలన

11 గంటలైనా విధులకు రాని సిబ్బంది

ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలు

ధర్మవరంరూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సమయపాలన కొరవడింది. ఉద్యోగులు, సిబ్బంది.. వారికి ఇష్టమొచ్చినప్పుడు విధులకు వస్తున్నారు.. పోతున్నారని రైతులు వాపోతున్నారు. దీంతో శుక్రవారం ఆంధ్రజ్యోతి కార్యాలయాన్ని విజిట్ చేయగా... 10 గంటలకు ఒక్క డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌బాబు తప్ప మిగిలిన అధికారులు గానీ.. సిబ్బంది గానీ.. ఎవరూ కార్యాలయానికి రాలేదు. కుర్చీలన్నీ ఖాళీలు ఉన్నాయి. వీఆర్‌ఓ గదుల తలుపులే తీయలేదు. 11 గంటలైనా అధికారులు రాలేదు. అధికారులతో పాటు కార్యాలయ సిబ్బం ది సైతం అందుబాటులో లేరు. వివిధ పనులు నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు, రైతులు గంటలకొద్దీ చెట్లు కింద నిరీక్షించసాగారు. ఆ రైతులను ఆంధ్రజ్యోతి మాట్లాడించగా.. కార్యాలయానికి ఎప్పుడు వచ్చినా ఉద్యోగులు ఉండరని, అడిగితే ఫీల్డ్‌కు వెళ్లారని చెబుతున్నారని, వాళ్లు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో అర్థం కావడం లేదని వాపోయారు. మూడు, నాలుగు రోజులు తిరిగితే గాని పని కావడం లేదన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి


ధర్నా చేస్తున్న వైఎస్ఆర్ కాలనీ వాసులు

ధర్మవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తమ కాలనీకి పది రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే ఆ సమస్య పరిష్కరించాలని స్థానిక వైఎస్ఆర్ కాలనీకి చెందిన మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు ధర్మవరం-ఎన్ఎస్ గేట్ రహదారిపై ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. వారు మాట్లాడుతూ.. తాము కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే వాళ్లమని, తాగునీటి కోసం పనులు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. ఈ సమస్యను మున్సిపల్ అధికారులకు పలుమార్లు తెలియజేసినా వారు పట్టించుకోలేదని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ డీఈ వీరేశ్‌కుమార్ వారి వద్దకు వెళ్లి మహిళలతో మాట్లాడారు. తంబాపురం, ఆత్మకూరు దగ్గర కరెంటు లైన్‌లు ఏర్పాటు చేస్తుండటంతో ఈ సమస్య వచ్చిందని, రాత్రి 12గంటలైన తాగునీరు వదులుతామని హామీ ఇవ్వడంతో ఆ మహిళలు ధర్నా విరమించారు.

బోగస్ పట్టాలతో భూమి ఆక్రమణ


కమిషనర్‌తో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ధర్మవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పుట్టపర్తి రహదారి పక్కన గల 650-2 సర్వే నెంబరులో భూమిని కబ్జా చేయడానికి కొందరు దొంగ పట్టాలను సృష్టించారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగుమధు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేసిన ఆయన మాట్లాడారు. ఆ సర్వే నెంబరులో అక్రమాలపై నెల రోజులుగా ఉద్యమాలు చేస్తున్నామన్నారు. అందులో ప్లాట్లు ఉన్న వారు అంతా ఆక్రమదారులు అని, వారికి ఇంటి పన్ను, డోర్‌నెంబరు ఇచ్చే ముందుగా రెవెన్యూ కార్యాలయంలో విచారించిన తరువాతే అనుమతులు ఇవ్వాలని కోరారు. విద్యుత్ మీటర్లు ఇవ్వకూడదని ట్రాన్స్‌కో ఏఈ నాగభూషణకు విన్నవించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, సహాయ కార్యదర్శి రమణ, ప్లంబర్స్ అసోషియేషన్ నాయకులు గోవిందరాజు, లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, తాజుద్దీన్, సురేంద్ర, నాగేంద్ర, శ్రీనివాసులు, దాదాపీర్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో నీటి ట్యాంక్


కూలడానికి సిద్ధంగా ఉన్న నీటి ట్యాంక్

తనకల్లు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద ఓవర్ హెడ్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. ట్యాంక్ పిల్లర్లకు సిమెంటు ఊడిపోయి.. లోపున్న ఇనుప కడ్డీలు తుప్పుపట్టాయి. దీంతో ఆ ట్యాంక్ సమీపంలో ఉన్న ఎమ్మార్సీలో సిబ్బంది, పాఠశాల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ శాఖాధికారులకు చెప్పినా.. స్పందించడంలేదని ఆ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ ట్యాంక్‌కు మరమ్మత్తులు చేపట్టాలని, లేకపోతే పూర్తిగా కూల్చివేసి.. కొత్తదాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


తుప్పు పట్టిన ఇనుప కడ్డీలు


దర్శినమల పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

బత్తలపల్లి పీహెచ్‌సీలో క్యాన్సర్ స్ర్కీనింగ్ సెంటర్

బత్తలపల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్ స్ర్కీనింగ్ సెంటర్‌ను డీఎంహెచ్‌ఓ ఫిరోజాబేగం శుక్రవారం ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. మహిళల్లో గర్భాశయ క్యాన్సర్‌ను గుర్తించేందుకు ఆర్డీటీ వారితో కలసి ఈ పీహెచ్‌సీలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్విరాజ్, ఆర్డీటీ గైనకాలజిస్ట్ జ్యోతిర్మయి, రమ్య, శిల్ప, శ్రీనివాస్‌రెడ్డి, నాగేంద్రనాయక్, జనార్దన్‌నాయుడు పాల్గొన్నారు.

● ధర్మవరంరూరల్ : మండలంలోని దర్శినమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రావులచెరువులోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ను జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎస్ ఫిరోజాబేగం శుక్రవారం తనిఖీ చేశారు. ఆమె వెంట డీఐఓ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రనాయక్, వైద్యాధికారి డాక్టర్ దిలీప్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటిక సమస్యను పరిష్కారించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

ధర్మవరంరూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలుకుంట్ల గ్రామంలో శ్మశానవాటిక సమస్యను పరిష్కారించాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూటూరు మహేంద్ర, ఆ గ్రామస్థులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నటరాజను వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడారు. సర్వేనెంబర్594లో వంకపోరంబోకు భూమిలో 86సెంట్లులో 60 సంవత్సరాలుగా శ్మశాన ఉందని, అదే గ్రామానికి చెందిన అమరనారాయణ, రామానాయుడులు ఆ స్థలాన్ని కబ్జా చేశారని ఆరోపించారు. ఈ సమస్యను కలెక్టర్, ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. రెండురోజుల క్రితం మాల కులస్థుడు చనిపోతే అక్కడ ఖననం చేయడానికి వెళ్లితే అడ్డుకునే యత్నం చేశారన్నారు. ఇందులో ఏలుకుంట్ల గ్రామస్థులు బీర్రు ప్రకాష్, పుష్పరాజ్, కుళ్లాయప్ప, బాబు పాల్గొన్నారు.

కమిటీలు ఏర్పాటు చేయండి


మంత్రి నాదెండ్లకు వినతి పత్రం ఇస్తున్న సురేష్‌కుమార్

పుట్టపర్తి రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మెరుగైన సేవల కోసం రక్షణ, విజిలెన్సు కమిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్‌ను తాను కోరినట్లు రాష్ట్ర వినియోగదారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం తాను అమరావతిలో మంత్రి కార్యాలయంలో కలిసి.. వినతి పత్రం అందజేసినట్లు వివరించారు.

వెటర్నరీ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోండి

నల్లమాడ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపేపల్లి సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్ గాయత్రి సక్రమంగా విధులకు హాజరుకాలేదని కార్యదర్శి త్రివేణి ఎంపీడీఓ ఆజాద్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన కార్యక్రమాలను పూర్తి చేయలేదని తెలిపారు. దీనిపై ఎంపీడీఓను వివరణ కోరగా ఇరువురిని కార్యాలయానికి పిలిపించి విచారణ చేస్తానని చెప్పారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

నల్లమాడ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆశ్రమ పాఠశాల పది పరీక్షా కేంద్రాన్ని రాష్ట్ర పరిశీలకుడు సుబ్బారావు శుక్రవారం తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలోని గదులను క్షుణంగా పరిశీలించారు. కిటికీల్లో ఉన్న చీటీలను గుర్తించి పరీక్ష కేంద్రం అధికారులను మందలించారు.

● ఓబుళదేవరచెరువు : స్థానిక పదో తరగతి పరీక్షా కేంద్రాలను రాష్ట్ర పరిశీలకుడు సుబ్బారావు, ఫ్లైయింగ్ స్క్వాడ్ గోపాల్‌నాయక్ శుక్రవారం వేరువేరుగా తనిఖీ చేశారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, శ్రీవిజ్ఞాన్, విజ్ఞాన్ పాఠశాలల్లో కేంద్రాలను తనిఖీ చేశారు.

విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలి

కదిరిఅర్బన్, మార్చి28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రూఅప్, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని సీపీఎం నాయకులు తహసీల్దార్ మురళీక్రిష్ణకు శుక్రవారం వినతిపత్రం అందచేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దినెలలోనే రెండుమార్లు సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15 వేల కోట్లు పైచిలుకు ప్రజలపై భారం మోపిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు సర్దుబాటు చార్జీలను తీవ్రంగా వ్యతిరేకించిన రాష్ట్ర ప్రభుత్వం.. ప్రస్తుతం ఆ భారాలు మరింత పెంచడం ఏమిటని ప్రశ్నించారు. వ్యవసాయానికి స్మార్టు మీటర్లు బిగించడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాబ్‌జాన్, రామమోహన్, ముస్తాక్, సుధాకర్‌రెడ్డి, నారాయణ, గంగప్ప, ఆంజనేయులు, ఉదయ్, సుధాకర్ పాల్గొన్నారు.

● ధర్మవరం: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం నాయకులు శుక్రవారం ట్రాన్స్‌కో ఏడీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచడంతో రైతులకు భారంగా మారిందన్నారు. అధికారంలోకి రాగానే వైసీపీ ప్రభుత్వం పెంచిన చార్జీలను తగ్గిస్తామన్న టీడీపీ నాయకులు... ఆ మాట మరిచి చార్జీలు మరింత పెంచడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం ఏడీ లక్ష్మీనరసింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్‌బాషా, సీపీఎంపట్టణ కార్యదర్శి మారుతి, సీఐటీయూ మండల కన్వీనర్ జేరమణ, కో కన్వీనర్‌లు ఎల్ ఆదినారాయణ, అయూబ్‌ఖాన్, హైదర్‌వలీ, వెంకటస్వామి, హరి, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.



కదిరి : తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

క్రైం న్యూస్..

తనకల్లు వాసి మృతి

తాడిపత్రి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): హుబ్లీ నుంచి తిరుపతికి వెళ్లే ప్యాసింజర్ రైలులో తనకల్లు మండలం కొక్కంటి గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా(50) మరణించాడు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం మహబూబ్‌బాషా గోవాకు వెళ్లేవాడు. అదేవిధంగా ఈనెల 2న గోవాకు వెళ్లిన అతను.. తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. రైలులో స్పృహ తప్పి పడిపోయిన అతన్ని తాడిపత్రి రైల్వేస్టేషన్‌లో దించి.. అక్కడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారని తాడిపత్రి రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. కాగా, మహబూబ్‌బాషాకు భార్య బాబ్జాన్, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, ప్రస్తుతం వీరు అనంతపురంలో ఉన్నారని ఆయన చెప్పారు.

చికిత్స పొందుతూ..


కృష్ణ (ఫైల్)

తనకల్లు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన టీడీపీ కార్యకర్త డేరంగుల కృష్ణ (54) ప్రమాదంలో గాయపడి.. చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. తనకల్లులోని ఇందిరానగర్‌కు చెందిన క్రిష్ణ.. అన్నమయ్య జిల్లాలోని అంగళ్లు వద్ద టీ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. వారం క్రితం టీ దుకాణంలో గ్యాస్ సిలెండర్ పేలి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అతన్ని తిరుపతిలోని రూయా ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక శుక్రవారం మరణించాడు. బీఈడీ చదివిన ఇతను మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో వలంటీర్‌గా కూడా పనిచేశారు. కృష్ణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వేటకొడవలితో దాడికి యత్నం

ధర్మవరంరూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేనిపల్లిలో బోయ నాగేంద్ర తనపై వేటకొడవలితో దాడికి యత్నించాడని, అందుకు అతని తల్లి బోయ కుళ్లాయమ్మ సహకరించిందని అదే గ్రామానికి చెందిన పూజారి గంగాధర్.. రూరల్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు మేరకు.. ఈనెల 27న సాయంత్రం గంగాధర్ మనవడు, బోయ కుళ్లాయమ్మ మనవడు ఆడుకుంటూ గొడవపడ్డారు. దీంతో గంగాధర్ ఆ ఇద్దరు పిల్లలను మందలించి.. ఇంటికి పంపించారు. ఈ విషయమై శుక్రవారం బోయ కుళ్లాయమ్మ.. పూజారి గంగాధర్ భార్య, కుమార్తెతో గొడవపడింది. అడ్డుకోబోయిన పూజారి గంగాధర్, అతని తమ్ముడు రామ్మోహన్‌పై బోయ కుళ్లాయమ్మ కుమారుడు బోయ నాగేంద్ర వేటకొడవలితో దాడికి యత్నించాడు. స్థానికులు అతన్ని అడ్డుకున్నారు. దీనిపై గంగాధర్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు బోయ నాగేంద్ర, బోయ కుళ్లాయమ్మపై కేసు నమోదు చేశారు.

అగ్నిప్రమాదం

తనకల్లు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పరాకువాండ్లపల్లి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం గుట్టకు నిప్పుపెట్టారు. దీంతో ఆ మంటలు సమీపంలోని శేఖర్‌కు చెందిన పొలానికి వ్యాపించాయి. పొలంలోని డ్రిప్, పైపులైన్, పీవీసీ పైపులు, సర్వీసు వైరు, కేబుల్‌వైర్ పూర్తిగా కాలిపోయాయి. దీంతో తనకు రూ. 50 వేలు నష్టం జరిగిందని, ప్రభుత్వమే తనను ఆదుకోవాలని రైతు శేఖర్ విజ్ఞప్తి చేస్తున్నాడు.

మందుగుండుకు పాడి ఆవు బలి

పుట్టపర్తి రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అమగొండపాలెం పొలాల్లో అడవి పందుల వేట కోసం ఉంచిన మందుగుండు పేలి ఓ పాడి ఆవు శుక్రవారం మరణించింది. అడవి పందుల కోసం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు జామపండులో మందుగుండ పెట్టి ఉంచారు. వీరజిన్నయ్యపల్లి రైతు ఇడగుట్టు చిన్నప్పకు చెందిన పాడి ఆవు దాన్ని శుక్రవారం దాన్ని కొరకడంతో.. మందుగుండు పేలి.. దవడ చిట్లిపోయింది. రక్తమోడుతూ ఆ పాడిరైతు ఇడగుట్టు చిన్నప్ప ఇంటికి చేరిన ఆ ఆవు.. కొద్దిసేపటికే మరణించింది.

అయ్యప్పస్వామి ఆలయానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న కేతా లోకేశ్ కుటుంబ సభ్యులు

ధర్మవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కేశవనగర్‌లో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయానికి 16వ వార్డు కౌన్సిలర్ కేతాలోకేశ్ రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. శుక్రవారం గురుస్వామి విజయ్‌కుమార్‌కు ఆ నగదును అందజేశారు. అయ్యప్ప స్వామి విగ్రహానికి పూత కార్యక్రమంలో భాగంగా వెండి, బంగారు కూడా అందజేస్తానని కేతాలోకేశ్ తెలిపారు.

ఆదర్శ రైతులకు సన్మానం


రైతులను సన్మానిస్తున్న సిబ్బంది

ఓబుళదేవరచెరువు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఆదర్శ రైతులు బత్తినపల్లి శ్రీనివాసులు, ఇనగలూరు వాసుదేవరెడ్డిని శుక్రవారం వెలుగు కార్యాలయంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ రవీంద్ర, వ్యవసాయాధికారి ఇలియాజ్ అహమ్మద్, టీఏ రెడ్డెప్ప, వెలుగు సిబ్బంది వేణుగోపాల్, వెంకటరమణ, సోముశేఖర్‌రెడ్డి, చెన్నకేశవులు, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మీ, లక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు.

వెదురు చెట్ల పెంపకంపై శిక్షణ

ముదిగుబ్బ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగారెడ్డిపల్లి గ్రామంలో నేషనల్ బ్యాంబో మిషన్ సాహకారంతో వెదురు చెట్ల పెంపకంపై శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రైతులు వాణిజ్య పరంగా వెదురు మొక్కలు పెంచితే.. ప్రభుత్వం ఒక హెక్టారుకు రూ.50 వేలు సబ్సిడీ ఇస్తుందన్నారు. ఇందులో బాల్కోవా, భీమా, తుల్దా.. నూతన్ రకాలను సాగు చేసుకోవచ్చని, ఒక హెక్టారుకు నాలుగు వందల మొక్కలు నాటుకోవచ్చని తెలిపారు. భవిష్యత్తులో వెదురుకు మంచి డిమాండ్ ఉంటుందని, రైతులు వెదురు సాగును తోట చుట్టూ కానీ, తోటలో కానీ పూర్తిగా సాగు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి లక్ష్మీనరసింహులు, ఉద్యానవన అధికారులు అమరేశ్వరి, లావణ్య, యామిని, వ్యవసాయ సిబ్బంది శ్రీనాథ్ పాల్గొన్నారు.


వెదురు చెట్ల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

వీధికుక్కలు, కోతులతో జనం బెంబేలు..!

● 8 నెలల్లో 361 మంది బాధితులు
● పట్టించుకోని పంచాయతీ అధికారులు


వీధిలో సంచరిస్తున్న కుక్కలు

గోరంట్ల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కోతులతోపాటు వీధి కుక్కలు అధిక సంఖ్యలో సంచరిస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వీటి దాడిలో 8 నెలల్లో 361 మంది గాయపడి, చికిత్స పొందినట్లు రికార్డులు చెబుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు గతయేడాది ఆగస్టులో 73, సెప్టెంబరులో 66, అక్టోబరులో 36, నవంబరులో 27, డిసెంబరులో 25, జనవరిలో 20, ఫిబ్రవరిలో 32, మార్చిలో 82మంది కోతులు, కుక్కకాట్ల వల్ల గాయపడి, ఎఆర్‌వీ ఇంజక్షన్ వేయించుకున్నారు. గోరంట్ల వీధుల్లో ఎక్కడబడితే అక్కడ మాసం విక్రయ కేంద్రాల ఏర్పాటు కావడంతో వీధికుక్కలు వ్యర్థాలు తిని మితిమీరిన సంతతితో సంచరిస్తున్నాయి. రోడ్లపై రాత్రింబవళ్లు తేడాలేకుండా పిల్లలు, పెద్దలపై దాడిచేస్తున్నాయి. దీనికి తోడు ద్విచక్రవాహనదారులను, కార్లను వెంబడిస్తూ ప్రమాదాలకు గురి చేస్తున్నాయి. 15 నుంచి 20 వరకు ఒక గుంపుగా కుక్కలు రోడ్లపై వీర విహారం చేస్తుంటే ఎంతటివారైనా భయపడాల్సి వస్తోంది. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ సుబ్బరాయుడు మండల సర్వసభ్య సమావేశంలో కుక్కల గురించి ప్రస్తావిస్తూ చర్యలు తీసుకోవాలని కోరారంటే పరిస్థితి, తీవ్రత్త అర్థమవుతుంది. చర్యలు తీసుకుంటామన్న అధికారులు ఆ ఊసే మరిచిపోయారు. ఇటీవల కాలంలో ఎక్కడనుంచి వచ్చాయోకానీ, అధిక సంఖ్యలో కోతులు గుంపులుగుంపులుగా వీధుల్లో సంచరిస్తున్నాయి. ఇళ్లనుంచేకాకుండా దుకాణాలనుంచి తినుబండరాలు తదితరవాటిన్ని ఎత్తుకెళ్లి నష్టం కలిగిస్తున్నాయి. చెట్లపైన, ఇళ్ల బాల్కానిలు, పైకప్పులపైనే ఉంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఒక కోతిని మందిలిస్తే మిగిలిన కోతులన్నీ ఏకకాలంలో పెద్దలపైనే ఎదురు దాడికి దిగుతున్నాయి. వాటిని మందలించకపోయినా, వచ్చి దాడి చేస్తున్నట్లు ప్రజలంటున్నారు. వీటితో ప్రజలు విసిగు చెందుతున్నారు. 1వ వార్డుకు చెందిన ఓ మహిళకు 20రోజుల వ్యవధిలో రెండుమార్లు కోతులు కరవగా, ఆమె ఐదేళ్ల కుమారుని గాయపరిచాయి. కోతులు, కుక్కలబారి నుంచి తమను రక్షించాలని ప్రజలు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.


నివాసాల మధ్య వానరాలు

నియంత్రణ లేకపోవడమే కారణం



నియంత్రణ చర్యలు లేకపోవడం వలన కుక్కల సంతతి మితిమీరిపోతోంది. గతంలో సొసైటీల ద్వారా బర్త్ కంట్రోల్ ప్రోగ్రామ్ నిర్వహిస్తూ ఆడకుక్కలకు ట్యుబెక్టమీ, మగ కుక్కలకు వేసక్టమీ చేసి వాటి సంఖ్యను కట్టడి చేసేవారు. పెంపుడుకుక్కలను పెంచేవారు సైతం రక్షణ చర్యలు చేపట్టపోవడంతో ప్రజలు వాటి బారిన పడుతున్నారు. జిల్లా అధికారులు సర్జన్ ద్వారా స్వచ్ఛంద సంస్థల సహకారంతో కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలి.

- శ్రీనివాసరావు, ఏడీ, పశు సంవర్ధకశాఖ

నాటువైద్యం విడనాడాలి



కోతులు, కుక్కలు కరచిన కేసులు ఆసుపత్రి కి అధికంగా వస్తున్నాయి. ఆసుపత్రిలో యాం టీ రేబిస్ వ్యాక్సిన్‌కు కొరతలేదు. ప్రమాదాలు జరిగిన వెంటనే గాయంపై పసనపాలు పెట్టడం, పసుపు రాయడం జరుగుతోంది. నాటు వైద్యం చేయకుండా కరచిన వెంటనే గాయాన్ని శుభ్రంగా సబ్బుతో కడగాలి. ఆసుపత్రిలో కరిచిన రోజు మొదలు తరువాత 3, 7 28వరోజులకొక్కసారి ఏఆర్‌వీ ఇంజక్షన్ వేస్తారు.

- డాక్టర్ వినోదకుమార్, వైద్యాధికారి

పశుసంవర్ధక శాఖ సహకరించాలి



కుక్కల నియంత్రణ కోసం ఎలాంటి చర్యలు చేపట్టాలన్నా జంతుసంరక్షణ వారి నుంచి వ్యతిరేకత ఉంది. వాటిని పట్టి, మరో ప్రాంతానికి తరలించాలన్న ఖర్చుతోకూడుకుంది. ఒక్కో కుక్క కోసం రూ.300 వరకు వెచ్చించాలి. పశు సంవర్ధక శాఖ వైద్యులు సహకరిస్తే వాటిని పట్టించవచ్చు. కోతుల విషయానికి వస్తే వాటిని పట్టేవారు. ఉద్దేశ్యపూర్వకంగా సంపాదన కోసం పట్టణ, గ్రామ ప్రాంతాలకు వాటిని తెచ్చి వదులుతున్నారు.

- సుబ్రహ్మణ్యం, కార్యదర్శి

నేడు ఎమ్మెల్యే పర్యటన

మడకశిరటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో శనివారం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు పర్యటించనున్నట్లు మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం ఉదయం పార్టీ ఆవిర్భావ వేడుకల్లో ఎమ్మెల్యేతోపాటు రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పాల్గొంటారు. 10.30 గంటలకు పలువురు కౌన్సిలర్లు వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. వారిని పార్టీలోకి ఆహ్వానించనున్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో పంట నష్టపోయిన వారికి చెక్కుల పంపిణీ, మహిళా దినోత్సవం, సాయంత్రం కొత్త మసీదులో ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

నేడు వారపు సంత

పెనుకొండ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పెనుకొండ వారపుసంత ప్రతి ఆదివారం నిర్వహిస్తారని, ఈ ఆదివారం ఉగాది, రంజాన్ పండగలు ఒకేసారి రావడంతో శనివారం రోజు సంత నిర్వహిస్తున్నట్లు కమిషనర్ సతీష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. వ్యాపారులు, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

వైసీపీ వలంటీర్ల ప్రధాన కార్యదర్శిగా గంగాధర్ రెడ్డి

పరిగి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరపల్లి గ్రామానికి చెందిన రంగనాథ్‌రెడ్డి వలంటీరు విభాగంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వైఎస్ జగన్ గురువారం నియమించారు. మాజీ మంత్రి ఉష శ్రీచరణ్.. రంగనాథరెడ్డిని అభినందించారు.

మందకృష్ణను కలిసిన గోపీనాథ్

పెనుకొండ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను పెనుకొండకు చెందిన సంఘ సేవకుడు, బీజేపీ నాయకుడు డాక్టర్ గోపీనాథ్ మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. గురువారం రాత్రి బెంగళూరులోని ప్రభుత్వ అతిథిగృహంలో మందకృష్ణ మాదిగను కలిసిన గోపీనాథ్ పూలమాలలు వేసి సత్కరించారు. తెలుగు రాష్ట్రాలలో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం 30ఏళ్లుగా ఆయన చేసిన కృషిని కొనియాడారు.

6న రాతిదూలం లాగుడు పోటీలు

గోరంట్ల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మరవ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద శ్రీరామనవమిరోజు రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకుడు నిమ్మల శ్రీధర్ తెలిపారు. ఏప్రిల్ 6న ఉదయం జరిగే పోటీల్లో గెలుపొందినవారికి ప్రథమ రూ.25 వేలు ద్వితీయ రూ.15వేలు, తృతీయ రూ.10 వేలు చెల్లిస్తామన్నారు. పాల్గొనే వారు కాడెద్దులకు రూ.500 డిపాజిట్లు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సాయంత్రం ఆలయం వద్ద ఉట్ల పరుష ఉంటుందన్నారు.

టీడీపీ శ్రేణుల సంబరాలు

రొళ్ల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మడకశిర మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్‌గా రొళ్ల మండలం హెచ్.టి.హట్టికి చెందిన సీనియర్ నాయకులు బి.ఎస్.గురుమూర్తికి ప్రభుత్వం కేటాయించడంపై మండలంలో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. కేక్‌కట్ చేసి టపాసులు పేల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు.

పౌరహక్కులపై అవగాహన

రొళ్ల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.రాయపురం పంచాయతీ చిగమతిగట్ట గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ షేక్షావలి ప్రజలకు పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో యువత విద్యార్థులు పౌర హక్కుల గురించి తెలుసుకొని చైతన్యవంతులు కావాలని సూచించారు. హెడ్‌కానిస్టేబుల్ రామలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

వేలం వాయిదా

గోరంట్ల, మార్చి28(ఆంధ్రజ్యోతి): మేజర్ గ్రామ పంచాయతీ గోరంట్లలోని వారపు సంత, స్టాండ్ ఫీజులు, వ్యాపార గదులకు శనివారం జరగనున్న వేలాలను వాయిదా వేసినట్లు కార్యదర్శి సుబ్రహ్మణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల వల్ల వేలం వాయిదా వేస్తున్నామని చెప్పారు. ఏప్రిల్ 3వ తేదీన వేలం నిర్వహిస్తామన్నారు.

గర్భిణులకు అన్నదానం


ఆసుపత్రిలో అన్నదానం చేస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయిబాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు అన్నదానం చేసినట్లు సభ్యులు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన గర్భిణులు, బాలింతలు నారాయణసేవలో భాగంగా 30మందికి అన్నదానం చేసినట్లు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలి

సోమందేపల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి రామాంజనేయులును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు హనుమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పెద్దన్న ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. పంచాయతీ కార్యాలయం సందర్శనకు వచ్చిన డీపీఓ సమత కార్యదర్శులతో సమీక్షలో ఉండగా సమాచారం అందుకున్న నాయకులు కార్యాలయానికి చేరుకున్నారు. కార్యదర్శికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బైఠాయించారు. విషయం తెలుసుకున్న డీపీఓ పోలీసుల సహాయంతో బయటకు వచ్చి సీపీఎం నాయకులతో మాట్లాడారు. మండల కేంద్రంలోని కొత్తపల్లి క్రాస్‌వద్ద బాలాజీనగర్‌లో ఉన్న మురుగుకుంట సమస్యగా మారిందని శుభ్రం చేయాలని కోరిన ప్రకాశ్ అనే వ్యక్తిని సంఘటనా స్థలానికి విచారణకు వెళ్లిన కార్యదర్శి అతనిపై దౌర్జన్యానికి దిగాడన్నారు. డీపీఓ మాట్లాడుతూ బాలాజీనగర్‌లో కాలువ సమస్యను వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యదర్శిపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు చేపడతామన్నారు. నాయకులు భాను, నాగభూషణం, రవి, కిష్టప్ప, గోవిందప్ప, ప్రకాశ్ పాల్గొన్నారు.


పీఈఓకు సమస్యను వివరిస్తున్న నాయకులు

మొండి బకాయిలు వసూలు చేయండి: పంచాయతీలో పేరుకుపోయిన మొండి బకాయిలను వెంటనే వసూలు చేయాలని డీపీఓ సమత సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆమె కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వేలంపాటలో కాంట్రాక్టర్ల నుంచి రావాల్సిన బకాయిలు, ఇంటి గుత్తులు వెంటనే వసూలు చేయాలని సూచించారు.

కరెంటు చార్జీలు తగ్గించకపోతే ఉద్యమిస్తాం

హిందూపురం అర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కరెంటు చార్జీలు తగ్గించకపోతే ఉద్యమిస్తామని సీపీఐ నాయకులు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఆ పార్టీ నాయకులు నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ నాడు వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు జగన్‌మోహన్‌రెడ్డి అదానీ కంపెనీతో ముడుపులు తీసుకొని సెకీ కంపెనీకి విద్యుత్ శాఖను ధారాదత్తం చేశారని ఎద్దేవా చేశారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న మీరు సెకీ ఒప్పందాన్ని వ్యతిరేకించారు. స్మార్ట్ మీటర్లు వద్దన్నారు. ప్రస్తుతం మీరు అదే ఒప్పందాన్ని కొనసాగించడం ఏంటని విమర్శించారు. వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. శ్రీనివాసులు, కేవీపీఎస్ రమణ, జ్యోతమ్మ, సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాము, సీపీఐ నాయకులు రాజప్ప, నందీశ్వర, శివకుమార్, లక్ష్మయ్య ఆనందు, గోపాల్, బైలప్ప పాల్గొన్నారు.

పెనుకొండ: ట్రూఅప్ చార్జీలు రద్దుచేయాలని, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హరి, బాబావలి, తిప్పన్న ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొంతకాలంలోనే రెండుసార్లు విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15.485కోట్ల భారం ప్రజలపై మోపిందన్నారు. ఈ భారానికి కారణం గత ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక వారు కూడా దానిని కొనసాగిస్తోందని విమర్శించారు. మహబూబ్‌బాషా, నాగరాజు, నరసింహ, ఆరీఫ్, రాజారావు పాల్గొన్నారు.


హిందూపురం: అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

న్యూస్ బాక్స్

మసీదుల వద్ద ముస్లింల నిరసన


మసీదు వద్ద నిరసన తెలుపుతున్న ముస్లింలు

గోరంట్ల, మార్చి28(ఆంధ్రజ్యోతి): జమియత్‌ఉల్మా ఏ హిద్ ఆధ్వర్యంలో గోరంట్లలోని అన్ని మసీదుల వద్ద చేతికి నల్లబ్యాడ్జిలు ధరించి శుక్రవారం ముస్లింలు శాంతియుత నిరసన చేపట్టారు. కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్‌బోర్డ్ అమెండ్‌మెంట్ బిల్లును వ్యతిరేకిస్తూ, నమాజు ముగిసిన అనంతరం నిరసన కార్యక్రమం చేపట్టారు. బిల్లు కారణంగా ముస్లిం సమాజానికి తీరని అన్యాయం జరుగుతుందన్నారు. మసీదు కమిటీ పెద్దలు, జమియత్‌ఉల్మా సభ్యులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


న్యాయాధికారి శ్రీధర్‌ని సన్మానిస్తున్న డీటీ జగన్నాథ్

చిలమత్తూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని హిందూపురం సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీధర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా న్యాయాధికారి హాజరయ్యారు. మహిళల హక్కులు, వారి రక్షణకు ఏర్పాటైన చట్టాలను ఆయన వివరించారు. బాలికల భద్రతకు కల్పించిన చట్టాలపై తెలియజేశారు. డీటీ జగన్నాథం, ఎస్ఐ మునీర్ అహమ్మద్, మహిళలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



మొమెంటోలు అందజేస్తున్న చైర్మన్ రమేష్

హిందూపురం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని లయోలా పాఠశాలలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. పాఠశాలలో నిర్వహించిన యాన్యువల్ అవార్డ్స్ కార్యక్రమానికి ఆయన హాజరైన మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఘనత లయోలా పాఠశాలకు దక్కిందన్నారు. భవిష్యత్తులో కూడా మరింత మందిని ఉన్నత శిఖరాలకు చేర్చాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పలు పోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. టీడీపీ నాయకులు ఉమాశంకర్‌రెడ్డి, ఐటీబీ బ్యాంక్ మేనేజర్ శశాంక్, ప్రిన్సిపాల్ ఫ్రాన్సిస్, చర్చి ఫాదర్ ఆంథోని పాల్గొన్నారు.

ఐలాకు ఆటోనగర్ భూమి అప్పగించడంపై హర్షం


శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఆటోనగర్ వాసులు

హిందూపురం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ భూమిని ఐలాకు అప్పగించడంపట్ల ఆటోనగర్ వాసులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావును ఆటోనగర్ వాసులు కలిశారు. వారు మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా ఆటోనగర్ ప్రాంతాన్ని ఐలాకు అప్పగించాలని పోరాటం చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు కాలేదని, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక చొరవతీసుకుని ముఖ్యమంత్రి కార్యాలయంలో చర్చించి ఐలాకు అప్పగించేలా కృషి చేశారన్నారు. దీనివల్ల ఆటోనగర్ అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుందన్నారు. ఆటోనగర్ యూనియన్ నాయకులు, అనిల్‌కుమార్, బేవనహళ్లి ఆనంద్, పరిమళ, బాబి, మల్లికార్జున పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన పనిముట్ల పంపిణీ


వెంకటలక్ష్మికి పనిముట్లు అందజేస్తున్న బీజేపీ నాయకులు

గోరంట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ యోజన పథకం ద్వారా మంజూరైన పనిముట్లను బీజేపీ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. కులవృత్తులను ప్రోత్సహించేందుకు ప్రధాని మోదీ 18 కులాలవారికి పనిముట్లు, ఆర్థిక చేయూతనోసం బ్యాంక్ రుణం అందిస్తున్నారన్నారు. మేదర వెంకటలక్ష్మికి మిషన్, వివిధరకాల పనిముట్లను అందించారు. కన్వీనర్ లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, శంకర్‌రెడ్డి, శంకర్, చలం, బాలక్రిష్ణ, హరీష్, షబ్బీర్, లక్ష్మీనర్సు పాల్గొన్నారు.

పెండింగ్ ఉన్నోళ్లు మాత్రమే ఈకేవైసీ చేయించుకోవాలి

జేసీ శివనారాయణశర్మ

అనంతపురం టౌన్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులో ఉండి ఈకేవైసీ చేయించుకోకుండా పెండింగ్ ఉన్నవారు మాత్రమే ఇపుడు చేయించుకోవాలని జాయింట్ కలెక్టరు శివనారాయణశర్మ తెలిపారు. ఈకేవైసీ విషయంలో లబ్ధిదారులు గందరగోళ పడుతున్న ఈనేపథ్యంలో జేసీ శుక్రవారం ఓ ప్రకటనలో స్పష్టత ఇచ్చారు. కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవడం వలన ప్రభుత్వం నుంచి అందే సబ్సిడీ కేటాయింపులు సులభంగా అందుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. నకిలీలను నిరోధించడానికి ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలో ఇంకా 2,20,688 మంది ఈకేవైసీ చేయించుకోలేదన్నారు. వారందరూ శనివారంలోగా చేయించుకోవాలని సూచించారు. నమోదు చేసుకోని వారి జాబితాలను ఆయా ప్రాంతంలోని డీలర్లు, గ్రామసెక్రెటరీ, సివిల్ సప్లై డీటీలకు పంపామని, అక్కడకు వెళ్లి తెలుసుకోవచ్చన్నారు. ఆజాబితాలో ఉన్నవారు మాత్రమే రేషన్ షాపుడీలర్, గ్రామ రెవెన్యూ అధికారి, సివిల్‌సప్లై డీటీల వద్దకు వెళ్లి ఈపోస్‌యంత్రాలలో ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని సూచించారు.

రంజాన్ వేళలు

హిందూపురం	ఇఫ్తార్ : 6.35	సెహరీ : 5.03
పెనుకొండ	ఇఫ్తార్ : 6.35	సెహరీ : 5.03
	(శనివారం సాయంత్రం)	(ఆదివారం ఉదయం)

పాచి పడుతున్న నీటి ట్యాంకులు

● శుభ్రపరచని కార్మికులు ● ఇబ్బంది పడుతున్న ప్రజలు


శుభ్రం చేయని నీటి ట్యాంకు

లేపాక్షి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి ప్రజల దాహార్తి తీర్చేందుకు గ్రామాలు, మండల కేంద్రాల్లో తాగునీటి ట్యాంకులను నిర్మించింది. వీటి ద్వారా కొళాయిలకు నీటిని పంచాయతీ సిబ్బంది నీటిని అందిస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా ట్యాంకులను శుభ్రం చేయకపోవడంతో వీటిలో పాచి, పురుగులతో కూడిన నీరు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఈ నీటిని తాగడంల్ల రోగాలబారిన పడుతున్నామని ప్రజలు అంటున్నారు. ట్యాంకులను శుభ్రం చేసేందుకు పంచాయతీ కార్మికులు జంకుతున్నారని ప్రజలు చెబుతున్నారు. మురుగునీరు లీకేజీ అయిన పైపుల ద్వారా నీరు వస్తున్నాయన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటి ట్యాంకులవైపు కన్నెత్తి కూడా చూడటంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు,పంచాయతీ సిబ్బంది పాలకులు, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మారెమ్మ ఆలయంలో పూజలు


అలంకరణలో అమ్మవారు

గుడిబండ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలిసిన తుమ్మలమారెమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొన్నారు.

శివాలయంలో...


అలంకరణలో స్వామివారు

పెనుకొండ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐముక్తేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం అర్చకులు కన్నాస్వామి, మూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం గావించారు.

నేడు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

అగళి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం నిర్వహించనున్న టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ కుమారస్వామి పిలుపునిచ్చారు. ఉదయం 10గంటలకు ఎన్టీఆర్ విగ్రహం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

అమరాపురం: మండల కేంద్రంలో శనివారం ఉదయం 10 గంటలకు ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ గణేష్ తెలిపారు. అలాగే ఎన్టీఆర్ విగ్రహం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా వేడుకలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. నాయకులు పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చెర్లోపల్లిలో తాగునీటి కష్టాలు

రొళ్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో నెల రోజులుగా ప్రజలు తాగునీటికి కష్టాలు పడుతున్నారు. గ్రామంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో తాగునీటికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు సమస్యను వెంటనే పరిష్కరించాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు. ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి దృష్టికి తీసుకెళ్లి రెండు పర్యాయాలు సరిచేయించారు. కానీ ప్రతి సారి ఇలానే జరుగుతుండటంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని గ్రామస్థులు శివకుమార్, రవి, గంగమ్మ తెలిపారు.

పండుగ రోజుల్లోనూ అందుబాటులో పురసేవలు

హిందూపురం అర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పర్వదినాలైనప్పటికి పురసేవలు అందుబాటులో ఉంటాయని మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జీఓ ఎంఎస్ నెం 46 ప్రకారం 31 లోపల ఇంటి పన్నులు, ఖాళీజాగా పన్నులకు సంబంధించి ఏకకాలంలో చెల్లిస్తే వడ్డీ 50 శాంత తగ్గించనున్నట్లు ఎతెలిపారు.